సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 25-4-2025 15/-

# షర్బత్ జిహాద్








జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'ఈద్ మిలాప్' సభలు

ఆయన ఒక అరుదైన ఆణిముత్యం

గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 47 సంచిక: 17 హైదరాబాద్
శుక్రవారం 25 ఏప్రిల్ 2025 రూ.15-00
26 షవ్వాల్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**ఎవరయితే విశ్వాసి అయిన తన సోదరుడిని పరామర్శిస్తాడో అతడు స్వర్గంలో ఉన్న ఎత్తయిన సౌధంలో ఉంటాడు.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| పంక్చర్ వాలా | ...... | 04 |
| షర్బత్ జిహాద్ | ...... | 05 |
| రమజాన్ మాసమా వెళ్ళిపోయావా ! | ...... | 09 |
| ఇస్లామ్ సందేశం– మౌలిక అంశాలు – 2 | ...... | 12 |
| తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'ఈద్ మిలాప్' సభలు | ...... | 12 |
| ఆయన ఒక అరుదైన ఆణిముత్యం | ...... | 14 |
| చిన్న చిన్న పనులతో పెద్ద పెద్ద సంతోషాలు | ...... | 16 |
| భార్యా భర్తల అనుబంధం | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| మార్గచిహ్నాలు (నిషానాతె రాహ్) – 1 | ...... | 20 |
| చరితార్థులు–2 : బేగం సోఫియా సోం | ...... | 23 |
| కవిత్వంతో కరచాలనం | ...... | 24 |
| ఏకాంతం, ప్రశాంతం, సుఖాంతం | ...... | 26 |
| పేష్ ఇమామ్ గతం, వర్తమానం | ...... | 29 |
| మలేరియా లక్షణాలేంటి? నివారణ ఎలా? | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| అల్లాహ్ చూపిన దాన మార్గం వక్ఫ్ | ...... | 34 |


**నయవంచకులు..**
**నమ్మక ద్రోహులు**



మైనారిటీ వర్గాలను
చంద్రబాబు నితీషు
నమ్మించి ముంచారు
చూడవోయి హితైషు!
కాస్కోండిక మీ పాలన
మూన్నాళ్ళ ముచ్చట
జనంతన్ని తరమకనే
పట్టండిక ఇంటి బాట!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## పంక్చర్ వాలా

**మంగళసూత్రాలు కొట్టేసి,** బర్రెలు గొర్రెలు లాక్కుని వాళ్ళకు పంచేస్తారు. ఈ మాటలు చెప్పింది ఎవరో ప్రత్యేకంగా ఇక్కడ చెప్పనవసరం లేదు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మన ప్రధాని గారు చెప్పిన మాటలు. ఎవరిని ఉద్దేశించి చెప్పారో వివరించవలసిన పనిలేదు.

మోడీగారే మరో సందర్భంలో హిందూ ముస్లిం రాజకీయాలు తాను చేయనని, అలా చేసిన రోజున రాజకీయాల్లో ఉండలేనని కూడా అన్నారు.

బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి దేశమంతా జరుగుతున్నప్పుడు, పార్లమెంటు సెంట్రల్ హాల్లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్నప్పుడు మోడీ గారు అక్కడ లేరు. ఆయన హర్యానాలో ప్రసంగించారు. ఈ ప్రసంగంలో ఆయనకు పంక్చర్ గుర్తొచ్చింది. వక్ఫ్ వద్ద ఇంత భూమి ఉంది, దీన్ని సరిగా వాడి ఉన్నట్లయితే ముస్లిములు పంక్చర్లు వేసుకునే పరిస్థితి ఉండేది కాదన్నారు.

మొదటి విషయం: కేవలం ముస్లిములు మాత్రమే దేశంలో పంక్చర్ వాలాలుగా ఉన్నారా? ఇతరులు లేరా? ఇతరులు పంక్చర్ వాలాలుగా ఉంటే వారిని ఆ స్థితికి నెట్టింది ఎవరు? పకోడీలు అమ్ముకోవడం కూడా ఉపాధే అని చెప్పింది ఆయనేనని గుర్తు పెట్టుకుంటే, పకోడీలు అమ్ముకునే ముస్లిమేతరుడు, పంక్చర్లు వేసుకునే ముస్లిముకన్నా ఆర్థికంగా హాయిగా, మస్తుగా బతుకుతున్నాడని అర్థమా?

దేశంలో రిక్షాలు లాగేవారు, రోజువారీ కూలీలు, భవన నిర్మాణ కార్మి కులు, మురికివాడల్లో బతుకుతున్న నిరుపేదలు, వలస కార్మికుల్లో హిందువులున్నారు, ముస్లిములున్నారు. ఈ బడుగుజనం బతుకులు ఇలా ఉండడానికి కారణమేమిటి?

గుజరాత్ అల్లర్లలో రెండు చేతుల్లో కరవాలాలు పట్టుకుని వీరంగం వేసిన రాజు మోచీ ఫోటో ఒకటి పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. ఆ రాజు మోచీ ఇప్పుడు చెప్పులు కుట్టుకుంటూనే బతుకుతున్నాడు. చరిత్రకారుడు అశోక్ పాండే అతనిని కలిసినప్పుడు గుజరాత్ అల్లర్ల విషయమై సిగ్గుపడుతున్నానని చెప్పాడట.

రెండవ విషయం: దేశంలో పేదరికాన్ని నిర్మూలించడం, అది ముస్లిముల పేదరికమైనా, మరెవరి పేదరికమైనా, పేదరిక నిర్మూలన చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదా? లేక వక్ఫ్ బోర్డుదా? వక్ఫ్ విషయమే మాట్లాడేదయితే, మందిరాల భూముల విషయంలో కూడా మాట్లాడి, వాటిని సరిగా వినియోగించుకుంటే దేశంలో హిందువుల్లో పేదరికం ఉండేది కాదని ఎందుకు చెప్పడం లేదు.

కొందరు పంక్చర్లు వేసుకుని బతుకుతుంటే రెక్కల కష్టంతో సంపాదించే గౌరవనీయమైన పనిలోనే ఉన్నారు– వారు ముస్లిము లైనా, హిందువులైనా.

దేశంలోని పేదల్లో హిందువులూ ఉన్నారు, ముస్లిములూ ఉన్నారు. అలాగే ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలలో హిందువులున్నారు. ముస్లిములు కూడా ఉన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ పేరు అందరికీ తెలుసు. విప్రో కంపెనీ అధినేత. దేశంలో విప్రో కంపెనీ చేపట్టిన స్థాయిలో సమాజ సేవాకార్య క్రమాలు బహుశా మరెవ్వరూ చేయడం లేదు. సిప్లా కంపెనీ ఔషధ కంపెనీ. ఖాజా అబ్దుల్ హమీద్ కంపెనీ. హిమాలయ బ్రాండ్ తెలుసు కదా. ముహమ్మద్ మెనల్ కంపెనీ. మోంగిని బేకరీల యజమాని హుస్సేన్ ఖురాకీవాలా, హందర్ద్ స్థాపించింది అబ్దుల్ మజీద్, లూలు మార్కెట్ యజమాని యూసుఫ్ అలీ. షాహ్‌నాజ్ హుస్సేన్ బ్యూటీ ప్రొడక్ట్స్ దేశంలో ప్రసిద్ధి చెందాయి. మిడ్ డే మ్యాగజైన్ ఖాలిద్ అన్సారీది. బాలీవుడ్‌లో ఖాన్‌ల గురించి అందరికీ తెలుసు. ఇన్ షార్ట్స్ అజర్ ఇక్బాల్ తయారు చేసిన యాప్, షేర్ చాట్ ఫరీద్ ఎహ్సాన్ తయారు చేసిన యాప్ ఇలాంటి పేర్లు చాలా ఉన్నాయి.

హిందువుల్లోను, ముస్లిముల్లోను పారిశ్రామికవేత్తలు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు ఉన్నారు. పేదలు కూడా ఉన్నారు. మతతత్వ విద్వేషం కారణంగా ముస్లిముల్లో పేదల సంఖ్య చాలా ఎక్కువ అన్నది కూడా వాస్తవమే. రాజకీయాల్లో ముస్లిములు ఎదగడం ఇంకా కష్టమై పోయింది.

దేశంలో మిగిలిన సముదాయాలతో పోల్చితే ముస్లిముల్లో పేదరికం వెనుకబాటు ఎక్కువగా ఉండడానికి కారణం మతతత్వ విద్వేషం, వివక్షలే. కాంగ్రెసు పార్టీకి ముస్లిములపై ప్రేమ ఉంటే అధ్యక్షుడిగా ముస్లిమును ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించిన మోడీ, తన పార్టీలో కనీసం ఎన్నికల్లో పోటీ చేసే టిక్కెట్లు ఎందుకు ఇవ్వడం లేదో జవాబు చెప్పాలి. త్రిపుల్ తలాక్ చట్టాల వంటివి తెచ్చి ముస్లిముల ఉద్ధరణ చేస్తున్నానని చెప్పే మోడీ ముస్లిముల స్కాలర్ షిప్పులు ఎందుకు రద్దు చేస్తున్నారో చెప్పాలి. ముస్లిం వ్యతిరేక విద్వేష రాజకీయాలు దేశంలో వాతావరణాన్ని ఎంతగా కలుషితం చేస్తున్నాయంటే ఇప్పుడు హిందూ షర్బత్ వేరు, ముస్లిం షర్బత్ వేరు అనే విభజన తీసుకొచ్చారు. ఉత్తరప్రదేశ్ బరేలీలో శ్రీరామ నవమి సందర్భంగా పబ్లిక్ పార్కులో ముస్లిములు రాకూడదని అడ్డు కున్నారట. హిందూ మహిళలు ఉంటారు కాబట్టి ముస్లిములు రాకూడదట. దేశంలో ఎలాంటి పరిస్థితి ఏర్పడుతుందో సమాజ శ్రేయోభిలాషులు గుర్తించవలసిన అవసరం ఉంది.

కవరు కథనం | అబ్దుల్ వాహెద్

# షర్బత్ జిహాద్



**రోజు రోజుకూ** జిహాదుల జాబితా చాంతాడులా పెరుగుతూనే ఉంది. ఇప్పుడు కొత్తగా ఈ జాబితాలో షర్బత్ జిహాద్ వచ్చి చేరింది. ఈ కొత్త జిహాదును కనిపెట్టింది బాబా రాందేవ్.

హందర్ద్ కంపెనీ తయారు చేసే రూహె అఫ్జా షర్బత్ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. చాలా మంది ఇష్టంగా తాగే పానీయం. బాబా రాందేవ్ కొత్త పానీయం తయారు చేశాడు. రూహె అఫ్జాపై దాడి చేయడానికి మతతత్వాన్ని ఉపయోగించుకున్నాడు. ఇలా చేయడం వల్ల రూహె అఫ్జాను దెబ్బతీయాలనుకున్నాడు. కాని బాబా రాందేవ్ దాడి తర్వాత చాలా మందికి రూహె అఫ్జాతో పాతజ్ఞాపకాలు గుర్తొచ్చాయి. రూహె అఫ్జా ఏమిటో తెలియని వారికి అదేమిటో తెలుసుకో వాలన్న కుతూహలం పెరిగింది. వెరసి రూహె అఫ్జా అమ్మకాలు పెరిగాయి. ఇప్పుడు కొన్ని చోట్ల టీపార్టీ మాదిరిగా రూఅఫ్జా పార్టీలు జరిగినట్లు కూడా తెలుస్తోంది. బాబా రాందేవ్ విద్వేషపూరిత, మతతత్వ వ్యాపార ప్రకటన వల్ల రూహె అఫ్జాకు లాభమే కలిగిందని చెప్పాలి.

రూహె అఫ్జా అనే పానీయం శతాబ్దానికి పైబడి ప్రజల దాహాన్ని తీరుస్తోంది. ఇప్పుడు రాందేవ్ బాబా తన పానీయాన్ని తయారు చేశాడు. రూహె అఫ్జా పేరుతోనే ఇది ముస్లిములు తయారు చేసిన పానీయమనేది తెలుస్తోంది. నిజానికి షర్బత్ అనే పదం కూడా పర్షియన్ భాషా పదం. ఇది బహుశా రాందేవ్ బాబాకు తెలియ దేమో. కాని రూహె అఫ్జా ముస్లిములు తయారు చేస్తారు కాబట్టి రూహె అఫ్జా వల్ల లభించే లాభాలను మస్జిదులు, మదరసాలు తయారు చేయడానికి ఉపయోగిస్తారని, ఇది షర్బత్ జిహాద్ అని, తన పానీయం తాగితే ఈ లాభాలు గురుకులాలు కట్ట డానికి ఉపయోగపడతాయని అన్నాడు. ఇంతకన్నా పచ్చిగా మతతత్వ ప్రదర్శన మరొకటి ఉంటుందని అనుకోలేము.

బాబా రాందేవ్ తన వ్యాపార ప్రకటనలో రూహె అఫ్జా పేరు ఎత్తలేదు, కాని ఆయన రూహె అఫ్జాగురించే మాట్లాడుతున్నా డన్నది స్పష్టంగా అందరికీ అర్థమయ్యింది. రూహె అఫ్జా కొన వద్దని ఆయన చెబితే కొనడం మానేస్తారని అనుకున్నాడు. కాని దేశంలో రూహె అఫ్జా అనేది శతాబ్దకాలంగా ఒక సంస్కృతిగా మారింది. రూహె అఫ్జాను దెబ్బతీయడం అంత తేలిక కాదు.

బాబా రాందేవ్ తన వ్యాపారాల వల్ల ఇప్పటి వరకు ఎవరికైనా దానధర్మాలు చేసిన ఉదాహరణలేమైనా ఉన్నాయా?

కాని రూహె అఫ్జా ప్రారంభించిన హకీం అబ్దుల్ మజీద్ తన యావత్తు సంపదను వక్ఫ్ చేశారు. యస్.. వక్ఫ్. దీనిపై కూడా ఇప్పుడు చాలా చర్చ జరుగుతుంది, కాబట్టి ఈ వక్ఫ్ గురించి కూడా తెలుసుకోవడం అవసరం. తన యావత్తు జీవితంలో సంపాదించినదంతా దానం చేశారు హకీంగారు. వక్ఫ్ చేయడమంటే దానం చేయడమే.

అప్పట్లో హకీం అబ్దుల్ మజీద్ దేశంలో ప్రముఖ వైద్యుడు. అనేక మంది ప్రముఖులకు ఆయన వైద్యం చేశారు. ఆయన 1906లో ప్రారంభించిన సంస్థ హందర్ద్. ఈ పదానికి అర్థం సానుభూతి అని.

రూహె అఫ్జా ఈ హందర్ద్ ఉత్పత్తుల్లో ఒకటి. వక్ఫ్ చేయబడిన ట్రస్ట్ దీన్ని తయారు చేస్తుంది. ఏ వ్యాపార సామ్రాజ్యమూ దీన్ని తయారు చేయడం లేదు. 1948లో హకీం అబ్దుల్ మజీద్ పెద్ద కుమారుడు హకీం అబ్దుల్ హమీద్ వక్ఫె ఆమ్‌గా ప్రకటించాడు. అంటే అందరికీ చెందే వక్ఫ్. వక్ఫె ఆమ్ అనే మాటను వక్ఫ్‌పై గగ్గోలు పెట్టేవారు, వ్యాపారసామ్రాజ్యాల విస్తరణకు మతతత్వాన్ని వాడుకునేవారు అర్థం చేసుకోలేరు. సాధారణ ప్రజలందరి సేవ కోసం దానమివ్వడమే వక్ఫె ఆమ్.

ఇలాంటి దానధర్మాల గురించి ఫక్తు వ్యాపారమే ముఖ్యం అనుకునే వారు అర్థం చేసుకోలేరు. కరోనా కాలంలో ప్రజలు చస్తున్నప్పుడు కరోనిల్ పేరుతో డబ్బులు దండుకోవాలని చూసిన వారు అస్సలు అర్థం చేసుకోలేరు.

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే హకీం అబ్దుల్ హమీద్ గారి వక్ఫ్ ఇస్లామీ ఉద్దేశాల కోసం పని చేసేది కాదు. కుల మత వివక్ష లేకుండా అందరికీ సేవలందించడం దీని ఉద్దేశం. ప్రారంభం నుంచి లాభాపేక్ష లేని చారిటబుల్ ట్రస్టుగానే కొనసాగుతోంది. రూహె అఫ్జా ద్వారా లేదా మరే ఇతర ఉత్పత్తి ద్వారానైనా లభించే లాభాలు కంపెనీ యజమానుల జేబుల్లోకి వెళ్ళవు. హందర్ద్ నేషనల్ ఫౌండేషన్‌కు వెళతాయి. హందర్ద్ నేషనల్ ఫౌండేషన్ ఈ సొమ్మును ఆధునిక వైద్యపరిశోధనలకు, ప్రత్యామ్నాయ వైద్యవిధానాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, వైద్య సౌకర్యాలు కల్పించడానికి, పేదలకు సహాయపడదానికి ఉపయోగిస్తుంది.

చాలా మందికి గుర్తుండే ఉంటుంది. బాబా రాందేవ్ అలోపతి వైద్యాన్ని విమర్శిస్తూ చెప్పిన మాటల తర్వాత ఆయనపై వైద్యులు భగ్గుమన్నారు. కాని యూనాని వైద్యవిధానానికి సంబంధించిన హందర్ద్ ఇలాంటి సంకుచిత వైఖరి ఎప్పుడు ప్రదర్శించలేదు. హందర్ద్ ఆసుపత్రి వంటి అలోపతి ఆసుపత్రిని నడుపుతోంది. ఇక్కడ చౌకగా వైద్యసదుపాయాలు అందజేస్తోంది. నర్సింగ్ కాలేజ్, బయోటెక్నాలజీ సెంటర్ వంటివి ఏర్పాటు చేసింది. ఈ వైద్య విద్యా సంస్థల్లో ముస్లిముల కన్నా ముస్లిమేతరులే ఎక్కువగా కనిపిస్తారు. హందర్ద్ ఏర్పడింది అవిభక్త భారత దేశంలో. స్వాతంత్ర్యం తర్వాత హకీం అబ్దుల్ మజీద్ గారి కుమారుడు హకీం అబ్దుల్ హమీద్ పాకిస్తాన్ వెళ్ళలేదు. హందర్ద్‌ను వక్ఫ్‌గా తీర్చిదిద్దాడు. 1962లో హందర్ద్ యూనివర్శిటీ స్థాపించాడు. ప్రతిష్ఠాత్మకమైన యూనానీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యాసంస్థ ఇది. పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో ప్రభుత్వం ఆయన్ను సత్కరించింది. ఈ సత్కారాలు టూత్ పేస్టులు, షర్బత్తులు అమ్మినందుకు కాదు, దేశంలో ప్రజల ఆరోగ్యం, ప్రజల్లో సౌభ్రాతృత్వం, భారతీయతల పట్ల ఆయన నిబద్ధతకు లభించిన అవార్డులు. వీటి నేపథ్యంలో రూహె అఫ్జా అనేది ఒక సాంస్కృతిక వారసత్వంగా కొనసాగుతూ వస్తుంది. ఇఫ్తార్లలో, హోలీ సంబరాల్లో, పెళ్ళి వేడుకల్లో ఎక్కడైనా సరే మనకు రూహె అఫ్జా కనిపిస్తుంది.

**హకీం అబ్దుల్ మజీద్ దేశంలో ప్రముఖ వైద్యుడు. అనేక మంది ప్రముఖులకు ఆయన వైద్యం చేశారు. ఆయన 1906లో ప్రారంభించిన సంస్థ హందర్ద్. ఈ పదానికి అర్థం సానుభూతి అని. రూహె అఫ్జా ఈ హందర్ద్ ఉత్పత్తుల్లో ఒకటి. వక్ఫ్ చేయబడిన ట్రస్ట్ దీన్ని తయారు చేస్తుంది. ఏ వ్యాపార సామ్రాజ్యమూ దీన్ని తయారు చేయడం లేదు. 1948లో హకీం అబ్దుల్ మజీద్ పెద్ద కుమారుడు హకీం అబ్దుల్ హమీద్ వక్ఫె ఆమ్‌గా ప్రకటిం చాడు. అంటే అందరికీ చెందే వక్ఫ్. వక్ఫె ఆమ్ అనే మాటను వక్ఫ్‌పై గగ్గోలు పెట్టేవారు, వ్యాపారసామ్రాజ్యాల విస్తరణకు మతతత్వాన్ని వాడుకునేవారు అర్థం చేసుకోలేరు. సాధారణ ప్రజలందరి సేవ కోసం దానమివ్వడమే వక్ఫె ఆమ్.**

**హకీం అబ్దుల్ హమీద్ గారి వక్ఫ్ ఇస్లామీ ఉద్దేశాల కోసం పని చేసేది కాదు. కుల మత వివక్ష లేకుండా అందరికీ సేవలందించడం దీని ఉద్దేశం. ప్రారంభం నుంచి లాభాపేక్ష లేని చారిటబుల్ ట్రస్టుగానే కొనసాగుతోంది. రూహె అఫ్జా ద్వారా లేదా మరే ఇతర ఉత్పత్తి ద్వారానైనా లభించే లాభాలు కంపెనీ యజమానుల జేబుల్లోకి వెళ్ళవు. హందర్ద్ నేషనల్ ఫౌండేషన్‌కు వెళతాయి. హందర్ద్ నేషనల్ ఫౌండేషన్ ఈ సొమ్మును ఆధునిక వైద్యపరిశోధనలకు, ప్రత్యామయ్నాయ వైద్యవిధానాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి, వైద్య సౌకర్యాలు కల్పించడానికి, పేదలకు సహాయపడడానికి ఉపయోగిస్తుంది.**

ఇప్పుడు రాందేవ్ బాబా షర్బత్ జిహాద్ చేస్తున్నారని ఆరోపిస్తూ, షర్బత్ జిహాద్ నుంచి ప్రజలను కాపాడుతానంటున్నాడు. కానీ రాందేవ్ బాబా మతతత్వ విద్వేష వ్యాఖ్యల తర్వాత హందర్ద్ ఏమిటో ప్రజలకు తెలిసి వచ్చింది. హందర్ద్‌కు ఉచితంగా పెద్ద స్థాయిలో ప్రచారం లభించింది. ప్రజల్లో ఆసక్తి పెరిగింది. అసంఖ్యాక వీడియోలు వచ్చాయి. హందర్ద్ గురించి తెలుసుకునే కుతూహలం పెరిగింది. బాబా రాందేవ్ ఈ మతతత్వ వ్యాపార ప్రకటన చేయకుండా ఉన్నట్లయితే బహుశా హందర్ద్ ఒక వక్ఫ్ ట్రస్టు అనేది ఎవరికీ తెలిసేది కాదేమో.

రూహె అఫ్జా అమ్మకాల వల్ల లభించే సొమ్ము మస్జిదులు, మదరసాలు కట్టడానికి ఉపయోగిస్తారనే ఆరోపణలో వాస్తవం గడ్డిపోచంత కూడా లేదు. దీనివల్ల బాబా రాందేవ్ వంటి వారి మతతత్వ విద్వేషం బట్టబయలయ్యింది.

బాబా రాందేవ్ వ్యాపార ప్రకటన తర్వాత రూహె అఫ్జా ఒక వ్యాపార సంస్థగా కాదు, ఒక సాంస్కృతిక, మత సామరస్య వారసత్వంగా ప్రజలకు పరిచయమయ్యింది. అజిత్ అంజుమ్ వంటి స్వతంత్ర యూట్యూబర్ల హందర్ద్ సందర్శించి అక్కడ పనిచేసేవారిలో ముస్లిమేతరులు ఎంత మందో, చివరకు హందర్ద్ సి.యి.ఓ కూడా ముస్లిమేతరుడేనన్న వాస్తవంతో పాటు రూహె అఫ్జా తయారీ ప్రక్రియను కూడా చూపించారు.

హందర్ద్ ఈ విద్వేష భరిత ప్రచారానికి తన శైలిలో, చాలా తీయగా జవాబిచ్చింది. నాణ్యతా ప్రమాణాల పట్ల తమ నిబద్ధతను తెలియజేస్తూ, హజార్డ్ అనాలిసిస్ అండ్ క్రిటికల్ కంట్రోల్ పాయింట్స్ (HACCP), ఫుడ్ సేఫ్టీ మేనేజిమెంట్ సిస్టమ్ (FSMS) ప్రమాణాలున్న సంస్థ అని ఎక్స్ వేదికగా ప్రకటించింది. ఫుడ్ సేఫ్టీ మేనేజిమెంట్ సిస్టమ్ ఆమోదించిన వనమూలికలను మాత్రమే తాము ఉపయోగిస్తామని చెప్పింది.

బాబా రాందేవ్ వ్యాపార ప్రకటన తర్వాత, షర్బత్ జిహాద్ అనే వ్యాఖ్య తర్వాత సామాజిక మాధ్యమాల్లో రూహె అఫ్జా ట్రెండ్ కొనసాగింది. చాలా మంది రూహె అఫ్జాతో తమ జ్ఞాపకాలను పంచు కున్నారు. బాబా రాందేవ్ ఏదైనా కొత్త ప్రొడక్ట్‌ను మార్కెట్టులో వదులుతున్నప్పుడు ఇలాగే మార్కెటులో ఉన్న ప్రొడక్టులపై దాడి చేస్తుంటాడని, నెస్లే మాగీపై బాబా రాందేవ్ చేసిన దాడిని కొందరు ప్రస్తావించారు. సతీష్ ఆచార్య వంటి రాజకీయ కార్టూనిస్టులు సీసాలో విద్వేషం అని కార్టూన్లు వేశారు. రూహె అఫ్జా విషయంలో బాబా రాందేవ్ చేసిన వ్యాఖ్యలు విద్వేషభరిత మైనవని కాంగ్రెసు నాయకుడు దిగ్విజయ్ సింగ్ కేసు వేశాడు. ఇలాంటి వివాదాలు బాబా రాందేవ్‌కు కొత్తేమీ కాదు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పతంజలి ఆయుర్వేదపై కోర్టుకు వెళ్ళింది. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాపార ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది. కోర్టు కూడా బాబా రాందేవ్‌పై కఠినంగా ప్రతిస్పందించింది.

పతంజలి ప్రొడక్ట్స్ ఫేసుబుక్కులో జారీ చేసిన వీడియోలో ఈ మతతత్వం స్పష్టంగా కనిపిస్తోంది. తన స్వంత సరుకులను అమ్ముకోడానికి మార్కెటులో ఉన్న ఇతరుల సరుకుపై బురద జల్లడం అనైతికం. నిజానికి దశాబ్దం క్రితం మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఒక సందర్భంలో బాబా రాందేవ్ రూఅఫ్జాపై విమర్శలు చేశాడని కొందరు గుర్తు చేస్తున్నారు.

బాబా రాందేవ్ చెప్పిన మాటలు కూడా ఒకసారి చూద్దాం– దేశంలో ఒక కంపెనీ షర్బత్ తయారు చేస్తున్నానని చెబుతుంది. కాని ఈ షర్బత్ వల్ల లభించే డబ్బులతో మదరసాలు, మస్జిదులు కడుతుంది. ఆ షర్బత్ మీరు తాగితే దేశంలో మస్జిదులు, మదరసాలు పెరుగుతాయి. పతంజలి షర్బత్ తాగితే గురు కులాలు, ఆచార్య గురుకుల్, పతంజలీ యూనివర్సిటీలకు లాభం కలుగుతుందని చెప్పాడు. ఇంత చెప్పిన బాబా రాందేవ్ తన వీడియోలో రూహె అఫ్జా నాణ్యతపై మాత్రం ఒక్క మాట చెప్పలేక పోయాడు. రూహె అఫ్జా సీసాపై కనిపించే సమాచారం ప్రకారం ఇందులో ఏఏ పదార్థాలు కలిసి ఉన్నాయో స్పష్టంగా చెప్పడం జరిగింది. మరో విషయమేమిటంటే, రూహె అఫ్జా ఉత్పత్తి చేసే కంపెనీ దేశంలో ఎక్కడా మస్జిదులు లేదా మదరసాలు కట్టించిన

ఒక్క ఉదాహరణ కూడా లేదు. హోలీ, రమజాన్ రెండు పండగలు హందర్ద్‌లో ఉత్సాహంగా జరుపుతారని తెలుస్తోంది. 2008లో జూహీ చావ్లా దీనికి బ్రాండ్ అంబాసిడరుగా పని చేశారు.

బాబా రాందేవ్ కంపెనీ 2006లో ప్రారంభమైంది. ప్రస్తుతం టూత్ పేస్టు మొదలు చర్మసౌందర్య ఉత్పత్తులు, జ్వరం మొదలు అనేక మందులు తయారు చేసి అమ్ముతోంది. పది వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యం ఇది.

బాబా రాందేవ్ కరోనా సంక్షోభంలో అలోపతి వల్లనే అసంఖ్యాకంగా ప్రజలు మరణించారని చెప్పాడు. 2020లో కరోనిల్ అనే మందుతో కరోనా తగ్గిపోతుందని మార్కెటులో విడుదల చేశాడు. కాని మోదీ ప్రభుత్వంలోని ఆయుష్ మంత్రిత్వ శాఖ స్వయంగా దీన్ని ఖండించింది. చివరకు దీన్ని నిషేధించవలసి వచ్చింది. 2016లో పతంజలి ఆమ్ల జ్యూస్ నాణ్యత విషయంలో వివాదం ముందుకు వచ్చింది. ఆర్మీ క్యాంటీన్లు ఈ జ్యూస్‌ను వెనక్కు పంపేసినట్లు తెలుస్తోంది. 2006లో సిపిఎం నేత బృందాకారత్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. పతంజలి ఉత్పత్తుల్లో ఎముకల పొడిని కలుపుతున్నారని అన్నారు.

దేశ రాజ్యాంగం మతవిద్వేష ప్రచారానికి అనుమతివ్వదు. హిందూ పానీయం, ముస్లిం పానీయమంటూ, షర్బత్ జిహాద్ అంటూ ప్రజల్లో చిచ్చుపెట్టే ఈ వైఖరిని ఏమనాలి.

హందర్ద్ ఉత్పత్తుల నాణ్యతపై ఇప్పటి వరకు ఎలాంటి వివాదమూ ఎన్నడూ ముందుకు రాలేదు. మరోవైపు పతంజలి విషయమై కోర్టు కేసులు, వివాదాలు అందరికీ తెలిసినవే.

స్వతంత్ర పాత్రికేయుడు సంజీవ్ శుక్లా రాసిన వ్యాసంలో ఒక సంఘటన గురించి ప్రస్తావించారు. సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌కు చెందిన సైనికులను పట్టుకుని వారిపై బ్రిటీషు వాళ్ళు విచారణ జరుపుతున్నప్పుడు జరిగిన సంఘటన అది. కల్నల్ సెహగల్, ధిల్లన్, షానవాజ్ ఖాన్ తదితరులపై విచారణ జరిగింది. జాతి గౌరవానికి ప్రతీకలుగా ఈ సైనికులు గర్వంగా నిలబడ్డారు. మొత్తం దేశం వారికి మద్దతుగా నిలబడింది. ఆజాద్ హింద్ ఫౌజ్ డిఫెన్స్ కమిటీని ఏర్పరచి కాంగ్రెసు వారికి మద్దతుగా ముందుకు వచ్చింది. నెహ్రూ స్వయంగా న్యాయవాది గౌను వేసుకుని కోర్టులో పోరాడారు. దేశంలో హిందూ ముస్లిం సమైక్యతను ధ్వంసం చేయాలని భావించిన బ్రిటీషు ప్రభుత్వం ఈ ఖైదీలకు పొద్దుట ఇచ్చే టీని హిందూ టీ, ముస్లిం టీగా వేర్వేరుగా ఇవ్వడం ప్రారంభించింది. హిందూ టీ వేరుగా, ముస్లిం టీ వేరుగా తయారు చేసి ఇచ్చేవారు. కాని విప్లవయోధులు ఈ విభజనను అంగీకరించలేదు. తమకు ఇచ్చిన టీని ఒక పెద్ద పాత్రలో వేసి అంతా కలిపేసి అందరూ పంచుకుని తాగేవారు. అది గడిచిన కాలం.

స్వాతంత్ర్యం తర్వాత ఏడు దశాబ్దాల కాలం గడిచిన తర్వాత ఇప్పుడు మళ్ళీ హిందూ ముస్లిం చిచ్చు పెట్టే శక్తులు అదే బ్రిటీషు వారి నీతిని కొత్తగా ఆచరణలో పెడుతున్నాయి. అప్పుడు బ్రిటీషు వారు హిందూ టీ, ముస్లిం టీ అని టీని వేరు చేశారు. అంతేకాదు రైల్వేస్టేషన్లలో హిందూ నీళ్ళువేరు, ముస్లిముల నీళ్ళు వేరుగా చేసి చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేశారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడి ఆసఫ్ అలీ రైల్వే మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ఈ హిందూ ముస్లిములను విభజించే బ్రిటీషు పద్ధతిని నిషేధించారు. కాని ఇప్పుడు హిందూ షర్బత్, ముస్లిం షర్బత్ అని పానీయాన్ని వేరు చేస్తున్నారు.

కాస్త నిజాయితీగా ఆలోచిద్దాం. కాసేపు ఈ హిందూ ముస్లిం రాజకీయాలను పక్కన పెట్టి ఆలోచిద్దాం. దేశంలో రూఅఫ్జా పానీయాన్ని ఇష్టపడే ముస్లిమేతరుల సంఖ్య ముస్లిముల కన్నా ఎక్కువ ఉంటుందన్నది నిజం కాదా?

కాని ఇప్పుడు విచిత్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. శతాబ్దానికి పైబడి తన ఉత్పత్తుల నాణ్యతకు పేరుపడిన సంస్థ. ఒక వక్ఫ్ ట్రస్టుగా, లాభాపేక్ష లేకుండా, ప్రజాసేవా కార్యక్రమాలకు ఖర్చు పెడుతున్న సంస్థ, కేవలం ముస్లిం స్థాపించిన సంస్థ కాబట్టి దాడులకు గురవుతోంది.

ఇప్పుడు వాతావరణమే మారిపోయింది. బిరియానీపై చర్చలు జరుగుతున్నాయి. హలాల్ ఉత్పత్తులపై గగ్గోలు లేస్తోంది. పానీయాలకు హిందూ ముస్లిం విభజన అంటుకుంది. ముస్లిములకు సంబంధించిన ప్రతి ఒక్క విషయమూ ఇప్పుడు వివాదాస్పదమే అవుతోంది.

ముస్లిములకు చెందిన భాషగా ముద్రవేసి ఉర్దూను కూడా ద్వేషించే వాతావరణంలో బతుకుతున్నాం. విచిత్రమేమిటంటే, షర్బత్ అనే పదాన్నే బాబా రాందేవ్ కూడా ఉపయోగించాడు. ఈ పదం పర్షియన్. ఈ పదానికి అర్థం పంచదార కలిసిన నీరు లేదా పానీయం. అరబీలో షరిబా అంటే అర్థం తాగడం. గులాబీ షర్బత్ అని రాందేవ్ తన వ్యాపారప్రకటనలో తన పానీయం గురించి చెప్పాడు. గులాబ్ కూడా పర్షియన్ పదమే. షర్బత్తు అనే పదం తెలుగులోకి కూడా వచ్చింది. తెలుగు నిఘంటువుల ప్రకారం ఇది పానకం లేదా తియ్యని పానీయం. హిందూ ముస్లిం చిచ్చుపెట్టే ఎత్తుగడలకు షర్బత్ మాదిరిగా తియ్యని జవాబు ఇవ్వవలసిన అవసరం ఉంది. ✤

# రమజాన్ మాసమా వెళ్లిపోయావా!

**అయూబ్ బాషా**

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
నెలవంక దర్శనంతో ప్రతి ఇంటా ఆనందాలను నింపావు
ఒకటికి డెబ్భైరెట్లు పుణ్యాలు వచ్చే బహుమతిని తెచ్చావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
షైతాన్ను బంధించి స్వర్గ ద్వారాలు తెరిపించావు
బద్దకంగా నిద్రించే జనాలను సహరీతో వేకువనే మేలుకొల్పావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
అరగంటకోసారి నీళ్లు తాగాల్సిన వేసవిలో వచ్చావు
ఐనా లెక్కచేయకుండా నిష్ఠతో ఉపవాసం ఉంచేలా చేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
కోరికల కొలిమిలో కాలకుండా అల్లాహ్ మీద భయభక్తులు నెలకొల్పే,
నిగ్రహ శక్తిని ప్రసాదించే బ్రేకులుగా ఉపవాసాలను చేశావు
ఖురాన్ పారాయణాలు, నిత్యం దైవ నామ స్మరణాలు పఠించేలా చేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
చిన్నపిల్లల చిలిపి అల్లరితో మసీదు కళకళలాడేలా, పెద్దల కళ్ళు కట్టిపడేశావు
పెద్దల సుకుమారపు మందలింపులు, జాగ్రత్తలు చెప్పేలా చేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
పూట గడవని పేదల అర్థాకలి బాధలు ఇఫ్తార్‌లో తెలియజేశావు
ఉపవాసం శిక్ష కాదు ఆత్మశుద్ధికి, ఆయురారోగ్యాలకు రక్షణ అని తెలియజేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
మొదటి రెండు రోజులు ఇబ్బంది ఉన్నా
మిగతా రోజులు మరిచిపోయేలా చేశావు
రోగులకు వృద్ధులకు మినహాయింపు ఇచ్చావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
కొందరికి అనారోగ్యమైతే ఉపవాసం ఒకరోజు విడిచినందుకు
మధన పడేలా చేసావు ఇంకొందరికి అనారోగ్యంలోనూ
ఇఫ్తార్‌లో చికిత్స తీసుకొని ఉపవాసం కొనసాగించేలా చేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
జకాత్, ఫిత్రా, సదఖాలు విధిగా చెల్లించాలని చెప్పావు
బంధువులకే ముందుగా హక్కు అని చాటి చెప్పావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
తరావీహ్ ఆచరించి లైలతుల్ ఖద్ర్ రాత్రులు నిత్యం దైవ నామ స్మరణతో పాటు
పాప ప్రక్షాళన కోసం దుఃఖంతో వేడుకునేలా చేశావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
విపత్కర పరిస్థితిలో కూడా ఆత్మ విశ్వాసాన్ని నింపుకునేలా చేశావు
రమజాన్ తదనంతరం కూడా దేహాన్ని ఆత్మ శాసించేలా,
అల్లాహ్ పట్ల భయభక్తులు జనించేలా చేయవూ
మసీదులన్నీ బోసిపోయేలా చెయ్యకు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
ఈదుల్ ఫిత్ర్ రోజు బంధువులందర్నీ ఒకేచోట చేర్చి సంతోషాలు నింపావు
తారతమ్యాలు మరిచి అందరినీ ఆత్మీయ ఆలింగనంతో మనసులను కలిపావు

రమజాన్ మాసమా వెళ్ళిపోయావా నేస్తమా
ఆర్ద్రత నిండిన మనస్సుతో వీడుకోలు పలుకుతున్నాము
నిత్య నూతనంగా మరో ఏడాది తప్పక కలుద్దాము.




**- ఎస్.ఎమ్. మలిక్**

## మానవ మనస్తత్వం

ధర్మ సందేశానికి దివ్య కుర్ఆన్ అవలంబించిన రెండవ విధానం మానవ మనస్తత్వాన్ని ప్రేరేపించడం. మనస్తత్వాన్ని మేల్కొలిపి మనిషి అంతరాత్మలోని సున్నితమయిన కోణాలను ఇది స్పర్శిస్తుంది. భావాలను భావోద్రేకాలను మీటుతుంది. మనిషి అంతరాత్మ, అతని ప్రవృత్తి, అతని అంతశ్శరీర సూచనల ద్వారా ఆధారాలను బోధపరుస్తుంది. ఈ బోధనకు మనిషి మనస్తత్వం ప్రభావితమవుతుంది, అది అతని అంతరాత్మ ఘోషగా పరిణమిస్తుంది. అతని నైజం, ప్రవృత్తి దాన్ని తృప్తిగా ఆలింగనం చేసుకుంటాయి. అతని శరీర తత్వం కూడా దైవాన్ని విశ్వసించాలని పరితపిస్తుంది, ఆయన సమక్షంలో ప్రణమిల్లాలని ఉవ్విళ్ళూరుతుంది!

> **నీ ప్రభువు దైవ దూతలకు చెప్పాడు, "నేను మన్నుతో మనిషి బొమ్మను సృజించనున్నాను, మరి నేను దాన్ని పూర్తి చేసి సిద్ధపరచిన తరువాత అందులో నా ఆత్మను ఊదుతాను, అప్పుడు మీరు అతని సమక్షాన సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయాలి" అని.** *(సాద్. 38:71, 72)*

మనిషిని దైవమే స్వయంగా రూపొందించి తీర్చిదిద్దడం, అతనికి దేవుని ఆజ్ఞాబద్ధులయిన దూతలు ప్రణమిల్లాలని దైవం ఆదేశించడం మనిషి ఘనతను చాటి చెబుతున్నాయి. సర్వ సృష్టిలో మానవ స్థానమేదో తెలుపుతున్నాయి.

మానవ సృష్టి ఎంత ఉన్నతమయినదో తెలిపేందుకు, తన పక్షాన మానవాళి అంతటికీ తన సందేశాన్ని అందజేసే బాధ్యత అప్పగిస్తాడు విశ్వ ప్రభువు. స్వయంగా మనిషిని సంబోధించి, మానవుల్ని ఒక విశిష్ట వర్గంగా నియోగిస్తున్నట్లు, మానవుల సంస్కరణ, మార్గ బోధన వారి బాధ్యత అని ప్రకటిస్తున్నాడు.

> **ఇక ప్రపంచంలో ఉత్తమమయిన వర్గం మీదే, మానవాళి సంస్కరణ, సన్మార్గ బోధనల కొరకు రంగంలోకి తేబడిన వారు మీరే. మీరు మంచిని ఆదేశిస్తారు, చెడుల నుండి వారిస్తారు, మీరు దైవాన్ని విశ్వసిస్తారు.** *(ఆలి ఇమ్రాన్. 3:110)*

అని వారి స్థానాన్ని స్వయంగా స్థిరపరిచాడు విశ్వ ప్రభువు. ఇంకా దైవాన్ని విశ్వసించడమే కాదు, ఆయన విధేయత పాటించే సందేశాన్ని ప్రజలకు చేరవేసే ఘనమయిన బాధ్యత ప్రదానం చేసినట్లు కూడా ప్రకటన చేస్తున్నాడు:

> **చెప్పివేయండి, "గ్రంథవహులారా! రండి, మీకూ మాకూ మధ్యన సమిష్టిగా వర్తించే ఒక విషయం పైన అంగీకారానికి వద్దాము. మనం అల్లాహ్ తప్ప మరెవరి విధేయతనూ పాటించము అని, మరెవరినీ ఆయనతోపాటు ఆరాధన, విధేయతల్లో భాగస్వాములగా ఎంచము అని, మనమూ మనలోని వారెవరినీ తమ ప్రభువుగా ఎంచము అనీను!" ఒకవేళ వారు (గ్రంథవహులు) దీనికి విముఖులయినట్లయితే స్పష్టంగా చెప్పివేయండి, "ఇక మీరే సాక్షులు, మేమయితే కేవలం దైవానికే దాస్యం చేసే, ఆయనకే విధేయులయిన వారము" అని.** *(ఆలి ఇమ్రాన్. 3:64)*

## సమాజం- మనిషి

మరో చోట, ఒకే దేవుని ఆరాధనతోపాటు తల్లిదండ్రుల సేవను సయితం తన ఆదేశాలలో చేర్చి, దైవం, తల్లిదండ్రులు ఎంతటి మహత్తు గలవారో తెలిపాడు:

***నీ ప్రభువు తుది నిర్ణయం చేసి వేశాడు, మీరు ఆయన్ని తప్ప మరెవరినీ ఆరాధించరాదని, తల్లిదండ్రుల ఎడల శుభ శ్రేయాలతో వ్యవహరించాలనీ, వారిలో ఒక్కరో ఉభయులో ముసలి వారయి మీతోపాటు ఉన్నట్లయితే వారి పట్ల "అబ్బబ్బ" అని కసరుకోరాదని, వారిని చీదరించుకుని పలకరించరాదని, వాస్తవానికి వారిని గౌరవ ప్రదంగా, మర్యాదగా పలకరించాలి అనీను.***

***(బనీ ఇస్రాయీల్. 17:23)***

అలాగే సామాజిక సంస్కరణల పట్ల జాగరూకత కల్పిస్తూ మనిషిని అనేక కోణాలలో స్పర్శించింది దివ్య కుర్ఆన్.

**1) ఏదయినా విషయం తెలియగానే దాన్ని గుడ్డిగా నమ్మ రాదని, పరిశోధించి నిజ నిర్ధారణ చేసుకోవాలని 2) స్త్రీ పురుషులు ఒకరినొకరు ఎగతాళిగా మాటలాడుకోరాదని, ఒకరిపై నొకరు ఎత్తిపొడుపుతో సంబోధించుకోరాదని, పరస్పరం దుర్భాష లాడుకోరాదని 3) విశ్వసించినవారు ఒకరి పట్ల మరొకరు అనుమానాలకు, అపోహలకు పాల్పడరాదని, ఒకరిని గురించి మరొకరు అనుమానంతో ఆరాలు తీస్తూ తిరగరాదని, పరోక్ష నిందకూ పాల్పడరాదనీ చెబుతూ- "మీలో ఎవరయినా తన మృత సోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా?" అని ప్రశ్నిస్తూ సమాజంలో చెడు అలవాట్ల పట్ల ఏవగింపు, జుగుప్స కలగజేస్తుంది, దానితోపాటు, "మీలో అందరికన్నా అధికంగా గౌరవనీయుడు మీలో అందరికన్నా అధికంగా దైవం పట్ల భయభక్తులు గలవాడు" అని హెచ్చరిస్తుంది.**

***(అల్ హుజురాత్. 49:6-13)***

మానవసృష్టి ఎంతో విశిష్టమయినది, ఉత్తమమయినదని, మానవ ఆంతర్యంలో నాటడానికి దైవం తాను స్వయంగా మానవునికి లోకజ్ఞానం, వస్తు జ్ఞానం ప్రసాదించాడని, మనిషి దైవదూతల కన్నా ఘనత గలవాడని నిరూపిస్తుంది దివ్య కుర్ఆన్.

## జ్ఞాన ప్రదానం

● *అల్లాహ్, తొలి మానవుడయిన ఆదమ్ (అ)కు సంపూర్ణ పదార్థ జ్ఞానం అందజేసి, ఆదమ్(అ)ని దైవదూతల సమక్షంలో నిలబెట్టి చెబుతాడు, "మీకు తెలిసిన పదార్థ జ్ఞానం (పదార్థాల పేర్లు) కాస్త తెలుపండి" అని. (అల్ బకర. 2:31)*

*దానికి దైవ దూతలు సయితం తమ అశక్తత వెలిబుచ్చుతారు. అప్పుడు అల్లాహ్ ఆదమ్ (అ) చేత ఆ పదార్థ జ్ఞానాన్ని ప్రదర్శింపజేస్తాడు.*

● *జనులారా! తమ ప్రభువు పట్ల భయభక్తులతో, చెడులకు దూరంగా మసలుకోండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా ఉనికిలోకి తెచ్చాడు, ఆ ఒక్క ప్రాణి నుంచే దాని జతను సృజించాడు, ఆ ఉభయుల ద్వారా ఎందరో పురుషుల్నీ స్త్రీలనూ (ధరణిలో) వ్యాపింపజేశాడు. ఆయన పేరు చెప్పుకునే మీరు ఒండొకరి హక్కుల్ని కోరి పొందుతారు. బంధుత్వ అనుబంధనాలను చెరపడం మానుకోండి. నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని కనిపెట్టుకునే ఉన్నాడు. (అన్ నిసా. 4:1)*

● *ప్రవక్తా! వారికి చెప్పు, "నేను కేవలం ఒక్క విషయాన్ని బోధిస్తున్నాను, నా మాట విని మీరు ఒంటరి ఒంటరిగానూ ఇద్దరేసి కలిసి సమిష్టిగానూ మీ మస్తిష్కాలకు పదును పెట్టి ఆలోచించండి, మీ తోటి వ్యక్తి (ప్రవక్త)లో మతి భ్రమించిన విషయం ఏముందనీ? ఆయన కేవలం ఓ తీవ్రమయిన యాతన రాక మునుపు మిమ్మల్ని హెచ్చరించేవాడే కదా! (సబా. 34:46)*

● *మానవుని సృజించిన వారము మేమే, అతని ఆంతర్యంలో మొలకెత్తే సంశయాలను సయితం ఎరిగిన వారమూ మేమే! మేము అతని బృహద్ధమని కన్నా చేరువగా నున్నాము. (కాఫ్. 50:16)*

● *ఆ పైన వారు, వారికి చేసిన ఉపదేశాన్ని మరచి పోయి నప్పుడు, మేము అన్ని విధాల సంపదల ద్వారాలు వారి కొరకు తెరచి వేశాము, కడకు వారు తమకు ప్రసాదించిన అనుగ్రహాలకు బాగా మత్తుగొని మగతలో పడిపోయినప్పుడు అకస్మాత్తుగా మేము వారిని పట్టుకున్నాము. ఇక వారు ఎటువంటి శుభానికయినా (నోచుకోలేదు.) నిరాశా నిస్పృహ లకు లోనయ్యారు. (అల్ అన్ఆమ్. 6:44)*

●*మానవుడు తొందరపాటు జీవి. ఇదో ఇప్పుడే నేను మీకు నా సూచనలు చూపిస్తాను, తొందర పడకండి.*

*(అల్ అన్బియా. 21:37)*

ఈ వచనాలన్నీ మానవ మనస్తత్వాన్ని కదిలించి అతనికి అతని స్థానాన్నీ, హోదాను తెలిపి ఆ స్థానం సార్థకమవ్వాలంటే ఎలా మసలుకోవాలో సుబోధకంగా వివరిస్తాయి. అయితే ఈ విషయాల పట్ల లోతయిన అవగాహన, ఆలోచన, చింతన అవసరం. అంతేకాక ఈ ప్రబోధనా విధానం స్వయంగా మనిషి కూడా అవలంబించాలని, దైవ సందేశాన్ని జనులెల్లరికీ బోధించే సందర్భంలో ఈ పద్ధతినే అనుసరించాలని ఉపదేశిస్తుంది దివ్య కుర్ఆన్:

●*ప్రవక్తా! నీ ప్రభువు బాట వైపునకు జనుల్ని ఆహ్వానించు, విజ్ఞత, వివేచనల ద్వారా, అత్యుత్తమ ఉపదేశం ద్వారా! జనులతో చర్చ అవసరమే అయితే అదీ అత్యుత్తమ రీతి లోనే చెయ్యి. అసలు నీ ప్రభువుకే బాగా తెలుసు, ఆయన దారి నుండి తప్పిపోయిన వారెవరో మరెవరు రుజుమార్గాన ఉన్నారో!! (అన్ నహ్ల్ 16:125)*

**(మిగతా వచ్చేవారం)**

# జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 'ఈద్ మిలాప్' సభలు




**సామరస్యానికి,** సంఘీభావానికి, సౌహార్ధానికి ప్రతీకగా జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ మండలం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా – పలు జిల్లాలలో – ఈద్ మిలాప్ సభలు విజయవంతంగా జరిగాయి. ఈ సభలలో హిందూ ముస్లిం క్రైస్తవ సోదరులు పాల్గొని నేడు దేశమంతటా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నొక్కి వక్కాణించారు. జమాఅతె ఇస్లామీ సంస్థ వారు తమ వంతు కర్తవ్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, దానిని శ్లాఘించాలని, సహకరించాలని వక్తలు








తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఏప్రిల్ 2వ తేదీన సద్భావనా ఫౌండేషన్ నాయకులు శ్రీ ఫయాజుద్దీన్ (ముజాహిద్) సారథ్యంలో మక్తల్‌లో నిర్వహించబడిన ఈద్ మిలాప్ సభకు వివిధ మతాల ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఖుర్‌ఆన్ అనువాదకులు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ అతిథి వక్తగా విచ్చేసి ప్రసంగించారు.

ఏప్రిల్ 5న తాండూరులో జమాఅత్ సారథ్యంలో నిర్వహించబడిన ఈద్ మిలాప్ సభకు రాష్ట్ర జమాఅత్ అధ్యక్షులు డా. ఖాలిద్ ముబష్షిరుజ్జఫర్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఎమ్.ఎల్.సి., ప్రభుత్వ ఛీఫ్ విప్ డా.మహేందర్ రెడ్డి, స్థానిక ఎం.ఎల్.ఏ. శ్రీ బి. మనోహర్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ వక్తగా పాల్గొన్నారు.

ఏప్రిల్ 6వ తేదీ ఆదివారంనాడు జడ్చర్లలో జరిగిన ఈద్ మిలాప్ సభకు కూడా రాష్ట్ర జమాఅత్ అధ్యక్షులు డా. ఖాలిద్ ముబష్షిర్ అధ్యక్షత వహించారు. సహీహ్ బుఖారీ అనువాదకులు



శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ తెలుగులో ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కె. పుష్పలత ముఖ్య అతిథిగా విచ్చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు, మత పెద్దలు ఈ సందర్భంగా ఉపన్యసించారు.

అలాగే మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్‌లలోనూ, గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ జోన్లలోనూ ఈద్ మిలాప్ సభలు విజయవంతంగా జరిగాయి. ✤



# ఆయన ఒక అరుదైన ఆణిముత్యం



## షాహ్ ఫైసల్ అవార్డు గ్రహీత

- ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**ఆయన ఒక విలక్షణమైన వ్యక్తి.**

ఆధ్యాత్మిక అంశాలకు ఆధునిక విద్యావిజ్ఞానాలను మేళవించి నవతరానికి దిశా నిర్దేశన చేసిన గొప్ప మేధావి ఆయన.

ఆయన రూపొందించిన ఇస్లామీయ ఆర్థిక ప్రణాళికల ద్వారా నేడు ప్రపంచంలోని ఎన్నో ముస్లిం దేశాలు లబ్ధి పొందుతున్నాయి.

పాశ్చాత్య దేశాలలో ఆయన నెలకొల్పిన ఇస్లామీయ పరిశోధనా సంస్థలు, దావా కేంద్రాలు అక్కడి యువతరానికి ఆశాజ్యోతిగా ఉన్నాయి.

ఇస్లామ్ ధర్మానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా సవూదీ అరేబియా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన "కింగ్ ఫైసల్ అవార్డు"తో ఆయన్ని సత్కరించింది.

జెద్దాలోని "ఇస్లామిక్ డెవలప్‌మెంట్ బ్యాంక్" (IDB) తన అత్యున్నత పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేసింది. నాలుగు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్‌ను కూడా ఆయన అందుకున్నారు.

విద్యావిషయికంగా ఆయన తలపెట్టిన బృహత్పథకాల మూలంగా నేడు పాకిస్తాన్‌లోని లక్షలాది మంది నిరుపేద బాలబాలికలు ఉచిత విద్యనార్జిస్తున్నారు.

ఆధునిక అవసరాలకు అనుగుణంగా పలు విద్యా పీఠాలకు, విశ్వవిద్యాలయాలకు ఆయన ఇచ్చిన పథకాల ద్వారా విద్యా రంగానికి ఎంతో మేలు జరిగింది.

జమాఅతె ఇస్లామీ టికెట్‌పై పాకిస్తాన్ సెనెటర్‌గా ఎన్నికై 22 ఏండ్లపాటు సేవలందించారాయన.

ఆయన పేరే ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్.

★★★

**అసాధారణ వ్యక్తిత్వం**

ఈయన 1932లో ఢిల్లీలో జన్మించారు. తనకు స్పృహ వచ్చేనాటికి భారతీయులు తెల్లదొరల బానిసత్వంలో మగ్గుతున్నట్లు కనుగొన్నారు. బాల్యం నుండే పుస్తక పఠనం పట్ల అమితమైన ఆసక్తి ఉండేది. సోషలిజం, కమ్యూనిజం ప్రపంచమంతటినీ ఆక్టోపస్‌లా అల్లుకుపోతున్న కాలమది. టీనేజ్‌లో ఉన్నప్పుడే ప్రముఖ రచయితల ఉర్దూ, ఆంగ్ల పుస్తకాలను చదివేశారు.

దేశ విభజనకు ప్రతికూలంగా స్పందించారు. అయితే 1947 తర్వాత తన కార్యక్షేత్రంగా పొరుగు దేశమే అనువుగా


ఉంటుందని తలపోసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోయారు. ఆ రోజుల్లోనే మౌలానా మౌదూది (రహ్మ) సాహిత్యానికి ప్రభావితులయ్యారు. మౌదూదీ గారి రచనలు ఆయనలో విప్లవ భావాలను నూరిపోశాయి. ఓ సాధారణ వ్యక్తిగాకాక, లోక కళ్యాణానికి ఉపయోగపడే గొప్ప కార్యాలకు శ్రీకారం చుట్టాలన్న ఆలోచన ఆ రోజుల్లోనే ఆయనలో కలిగింది. కరాచీ యూనివర్సిటీ నుండి పి.జి చేశారు. న్యాయశాస్త్రంలో కూడా డిగ్రీ పొందారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడే పాకిస్తాన్‌లోని 'జమీఅతె తులబా' అనే విద్యార్థి యూనియన్‌లో చేరారు. అవిభక్త పాకిస్తాన్‌లో 'జమీఅతె తులబా' నాజిమె ఆలాగా ఎన్నికయ్యారు. విద్యార్థిగా ఉన్నప్పుడే మూడు మ్యాగజైన్లకు సంపాదకత్వం వహించారు.

## విద్యావిషయిక సేవలు

ఉన్నత చదువులు పూర్తి కాగానే కరాచీ యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్‌గా విద్యాసేవలు ప్రారంభించారు. బ్రిటన్‌లోని లెస్టర్ యూనివర్సిటీలోనూ, జెద్దాలోని కింగ్ అబ్దుల్ అజీజ్ యూనివర్సిటీలోనూ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇస్లామాబాద్‌లోని ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో, ఐడిబిలో కూడా విద్యా విషయిక సేవలందించారు.

ఇస్లామీయ ఆర్థిక, వాణిజ్య విషయాలకు సంబంధించి ఆయన చేసిన రచనలకు సూడాన్, ఒమాన్, మలేషియా, సవూదీ అరేబియా, నైజీరియా, జర్మనీ, బ్రిటన్, అమెరికా దేశాలలో విశేష ఆదరణ లభించింది.

## ఇస్లామ్ పరిచయం




ఆంగ్లం, ఉర్దూ భాషలలో ఆయన మొత్తం 120 పుస్తకాలు రచించారు. ఆయన రచించిన "ఇస్లామ్ ఎట్ ఎ గ్లాన్స్" (**Islam at a glance**) చిరు పుస్తకాన్ని తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ (**TIP**) సంస్థ యాభయ్యేళ్ళ క్రితమే తెలుగులో **"ఇస్లామ్ పరిచయం"** పేరుతో ప్రచురించింది. గీటురాయి సంపాదకులు శ్రీ ఎస్.ఎమ్.మలిక్ అనువదించిన ఈ చిరు పుస్తకం ఇప్పటి వరకు 25 ఎడిషన్లుగా వెలువడింది.

## ఇస్లామిక్ ఫౌండేషన్ (U.K)

ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రొఫెసర్ ఖుర్షీద్ అహ్మద్ గారు ఖుర్రమ్



మురాద్‌తో కలసి ఇంగ్లండ్‌లోని లెస్టర్‌లో స్థాపించిన "ఇస్లామిక్ ఫౌండేషన్ (**U.K**)" ఒక్కటీ ఒక ఎత్తు. ఈ సంస్థకు ఆయన డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఐరోపా దేశాలలోని లక్షలాది మందికి, ముఖ్యంగా యువతీ యువకులకు ఈ సంస్థ సైద్ధాంతికంగా మార్గదర్శకత్వం వహిస్తోంది. 2001లో ఈ సంస్థను సందర్శించే అదృష్టం మీ ఈ రచయితకూ లభించింది.

పాకిస్తాన్‌లోని వెనుకబడిన ప్రాంతాలలో ఉపేక్షకు గురవుతున్న బాలబాలికలను విద్యా విషయికంగా తీర్చిదిద్దడానికి ఆయన శ్రేయోభిలాషుల ఆర్థిక సహకారంతో రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పారు. రీడ్ ఫౌండేషన్, హిరా ఎడ్యుకేషన్, గ్రీన్ క్రిసెంట్ ట్రస్ట్‌ల సారథ్యంలో నడుస్తున్న ఈ స్కూళ్ళలో లక్షలాది మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇదంతా ప్రొఫెసర్ సాబ్ ఖాతాలో ఎడతెగని పుణ్యమే (సదఖయె జారియాయే).

## 'తర్జుమానుల్ ఖుర్ఆన్' సంపాదకత్వం

"ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలసీ స్టడీస్" అనే సంస్థను స్థాపించి అనేక విశ్వవిద్యాలయాలకు మార్గదర్శక సూచనలు ఇచ్చారు. ఇన్ని బాధ్యతల్ని నిర్వహిస్తున్నప్పటికీ రచనా ప్రక్రియను మాత్రం మానుకోలేదు. పత్రికా రచనను కూడా కడదాకా కొనసాగించారు. సుదీర్ఘకాలంగా మౌలానా మౌదూదీ స్థాపించిన 'తర్జుమానుల్ ఖుర్ఆన్' మాసపత్రికకు సంపాదకత్వం వహిస్తూ వచ్చారు.

గత కొంతకాలంగా అస్వస్థతకు గురై ఉన్న ఈ అలుపెరుగని యోధుడు 93 ఏండ్ల వయసులో, కుదుటపడిన మనస్సుతో తన స్వామి సన్నిధికి చేరుకున్నారు. కారుణ్యప్రభువు అల్లాహ్ ఆయన పట్ల ప్రసన్నుడవుగాక! ఆయన్ని మన్నించి, ఆయన సేవల్ని స్వీకరించి, అనుగ్రహభరితమయిన స్వర్గవనాలలో ఓలలాడే సౌభాగ్యాన్ని ఆయనకు ప్రసాదించాలని ప్రార్థన. (ఆమీన్) ✤

# చిన్న చిన్న పనులతో పెద్ద పెద్ద సంతోషాలు

అర్షియా

**ఉరుకుల పరుగుల జీవితం బంధుత్వ సంబంధాల దూరం పెంచుతోంది.** ఒకరిని మించి ఒకరు పైచేయి సాధించాలనే పరుగుపందెంలో మానవసంబంధాలు యాంత్రికంగా మారిపోతున్నాయి. పురుషులు, మహిళలు, యువతీ యువకులు, విద్యార్థినీ విద్యార్థులు అంతా జీవిత పరుగు పందెమనే ఆటలో తీరిక లేకుండా గడుపుతున్నారు. నేటి వర్తమాన కాలంలో భర్త సంపాదనకు తోడు భార్యలు కూడా ఉపాధి  అన్వేషణలో ఉద్యోగాలు వెలగబెట్టాల్సి వస్తోంది. దీంతో మహిళలు ఇంటినీ, అటు ఉద్యోగాన్ని నిర్వర్తించడం కత్తిమీద సాములా మారింది. క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. వెరసి మహిళలు తీవ్ర ఒత్తిడికి మానసిక వేదనకు గురవుతున్నారు. ఇక బంధువులు, బంధుత్వాలకు సమయమెక్కడ ఉంటుంది. ఇల్లు, పిల్లలు, భర్త, ఉద్యోగం వీటికే తీరిక దొరక్కపోతే ఇక బంధువులకోసం సమయమెక్కడ దొరుకుతుంది.  ఇలా నెలలు, సంవత్సరాలు కూడా గడిచి పోతున్నాయి. బంధుమిత్రులను, రక్తసంబంధీకులను కలిసి ఆప్యాయంగా మాట్లాడే, కనీసం మొబైల్ ఫోన్‌లో మాట్లాడే తీరుబడి కూడా లేకుండా పోతోంది. రక్తసంబంధీకులైనా, బంధుమిత్రులైనా 'మనవాళ్లు' అనే భావనతో ఆప్యాయంగా మెలిగినప్పుడే దానిలోని మాధుర్యాన్ని ఆస్వాదించవచ్చు. మన అన్నవాళ్లకు 'మనం' అనే భావన కల్పించడం ఎంతో అవసరం. ఆ స్పర్శతో వాళ్ల మనస్సులను స్పృశించినప్పుడే బంధుత్వ సంబంధాల మాధుర్యం తెలిసివస్తుంది. బంధువుల మధ్య అంతరాలు పెరిగినప్పుడు మనస్సులో అశాంతి, అసూయ, కల్మషమనే బీజాలు నాటుకుంటాయి. ఊపిరి పీల్చుకోలేనంత తీరిక లేకపోయినప్పటికీ మనకున్న దాంట్లో కొంత సమయం బంధుమిత్రుల కోసం సమయం కేటాయిస్తే అనంతమైన సంతోషాలు మన సొంతమవుతాయి. వాళ్ల మనస్సు జయించవచ్చు. వాళ్ల దీవెనలకు నోచుకో వచ్చు.

మొబైల్ వచ్చాక బంధుమిత్రులతో మాటిమాటికీ కలుసుకునే అవకాశాన్ని కోల్పోయాం. ఏ పనికైనా ఫోన్ మాటలతోనే పని కానిస్తున్నాం. ఫోన్ లో మాట్లాడ్డం కూడా ఇప్పుడు తూకం వేసుకుని మాట్లాడుతున్నాం. మనకేదైనా అవసరం వచ్చిపడితేనే ఆ అవసరం తీర్చుకునేందుకే మన వాళ్లకు ఫోన్ చేస్తున్నాం. అలా కాకుండా కేవలం తమ వారి యోగక్షేమాలు తెలుసుకునే ఉద్దేశ్యంతోనే మన అన్నవారికి ఫోన్ చేస్తే వాళ్ల మనస్సు ప్రేమతో ఉప్పొంగుతోంది. కేవలం మీ క్షేమ సమాచారం తెలుసుకునేందుకే ఫోన్ చేశాననే ఒక్క నిమిషం ఫోన్ కాల్ మీ మధ్య ఉన్న అపోహలు, అపార్థాలు తొలగించి ప్రేమను ఇనుమడింపచేస్తుంది. మీ వాళ్ల దృష్టిలో మీ విలువ, గౌరవం, ప్రేమ పెరుగుతాయి. కనీసం వారం, పదిరోజులకోసారైనా మీ బంధుమిత్రుల్లో ఎవరో ఒకరిని ఫోన్‌లో పలుకరించడం అలవాటుగా చేసుకోండి. ఇలా పుట్టింటి వారి తరుపు వారికైనా, మెట్టింటి వారి తరపువారికైనా ఫోన్ చేసి మాట్లాడి వాళ్ల క్షేమ సమాచారాన్ని తెలుసుకుంటే మీరు వాళ్లకు మరింత దగ్గరవ్వచ్చు. మీ బంధుమిత్రుల సుఖదుఖాలు, ఆరోగ్య పరిస్థితులు, కష్టసుఖాల సమాచారం తెలిసుంటే వాళ్లకు ఫలానా ప్రత్యేక రోజులో వాళ్లను ఫోన్‌లో పలకరించవచ్చు. ఏదైనా కష్టమొస్తే వాళ్లని ఓదార్చవచ్చు. ఏదైనా సంతోష వార్త తెలిస్తే వాళ్లను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలపవచ్చు. శుభ ఘడియల్లో వీలుకుదిరితే మీ తాహతుకు తగ్గ బహుమతిని కానుకగా పంపండి. ఇలా చేయడం వల్ల మీ బంధుత్వ సంబంధాలు బలపడతాయి. అనంత సుఖసంతోషాలు మీ సొంతమవుతాయి. ఇక్కడ మీరిచ్చే కానుక ఎంత విలువ చేస్తుంది ప్రధానం కాదు. మీరు ప్రదర్శించే ప్రేమే వెలకట్టలేనిది. 'నా అన్న వాళ్లు నా మేలు కోరే వాళ్లు ఉన్నారు, నా కష్టసుఖాల్లో పాలుపంచుకునే వాళ్లున్నార'న్న ధైర్యాన్ని ఇచ్చినట్లవుతుంది. ఇలాంటి శుభ సంతోషాల ఘడియలు ఎవరి జీవితాల్లోనైనా సువర్ణాక్షరాల్లో రాయదగ్గవిగా నిలిచిపోతాయి. మధుర జ్ఞాపకాలుగా మిగిలి పోతాయి. మీ బంధుమిత్రుల, రక్త సంబంధీకులకు వాళ్ల వాళ్ల స్థితిగతులకనుగుణంగా ఎవరినెప్పుడు ఫోన్‌లో పలుకరించాలో, ఎవరినెప్పుడు కలుసుకోవాలో మీ మొబైల్ ఫోన్ డైరీలో రాసుకొని రిమైండర్ పెట్టుకోండి.  బంధు మిత్రులకు మనం చేసే చిన్న వాట్సాప్ మెసేజ్ వాళ్లకు ఎంతో ప్రేమను పంచుతుంది. మీ చేతి కొనల వేళ్లతో మీ బంధుత్వ  సంబంధాలను మెయింటైన్ చేయవచ్చు. ఒక్క వాట్సాప్ మెసేజ్‌తో మీ బంధుమిత్రుల మోముల్లో చిరునవ్వులు చిందించవచ్చు. మీ ఒక్క వాట్సాప్ మెసేజ్ వాళ్ల మనస్సులో మీ గౌరవం, విలువ ఇనుమడింప చేస్తుంది. మన అన్న వాళ్లు మీ మనస్సులో నిత్యం గుర్తుంచు కుంటామనే భావన వాళ్లలో కలిగించాలి. మీకు వీలు చిక్కినప్పుడు ఒక మంచి మాట, ఒక దీవెన, మీ శుభాకాంక్ష వాట్సాప్‌లో పంపండి. కానీ అదేపనిగా రోజల్లా వాట్సాప్‌లో మెసేజులు పంపడం వల్ల అవతలి వారికి విసుగుపుడుతుంది. గృహిణిలైనా, వర్కింగ్ ఉమెన్ లైనా ఇంటర్నెట్, వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే బంధుత్వ సంబంధాలను చక్కగా నిర్వహించుకోవచ్చు. మెట్టినింట అత్తామామలు, ఆడబిడ్డలు, తోడికోడళ్లు, పుట్టినింట అక్కలు, చెల్లెళ్లు, వదినలు, తదితర బంధువులకు తమకు అనుకూలమైన వేదికల ద్వారా యోగక్షేమాలు తెలుసుకోవడం వల్ల బంధుత్వ సంబంధాలకు ప్రాధాన్యతనిచ్చినవారవుతారు. వీటన్నింటి ఉద్దేశం ఒక్కటే మన అన్నవారికి మన అన్న భావన కల్పించడమే. సంబంధాలను పటిష్టపరుచుకోవడమే. మనవాళ్లు అన్న భావన మనస్సుల్లో ప్రేమామృతాన్ని కురిపిస్తుంది. ఏడు సముద్రాల అవతల ఉన్నా సరే మన ఇంటివారైపోతారు. ఒకవేళ ఈ భావన లేకపోతే ఇంటివారైనా పరాయివారిలాగా మారిపోతారు. ❖

# భార్యాభర్తల అనుబంధం

షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం

**రోజూ సాయంత్రం షైతాన్‌ల బాస్ తమ శిష్యుల నుండి వారు వెలగబెట్టిన పనుల వివరాలు అడుగుతాడు.**

"అయ్యా! నేను చాలామందిని నమాజ్ చదవకుండా చేసాను" అంటాడు ఒకడు.

"అయ్యా! నేను కొందరితో మద్యం, జూదం, వ్యభిచారం లాంటి అధర్మ పనులు చేయించాను" అని అంటాడు మరొకడు.

"నేను ఒక పండితుడ్ని పాప కార్యం చేసేలా చేసాను" అంటాడు.

చివరిగా ఒకడు "నేను భార్యాభర్తల మధ్య తగువు పెట్టి వచ్చాను" అని అంటాడు.

అప్పుడు ఆ షైతాన్ గురువు "శభాష్ నువ్వు అందరికన్నా పెద్ద పని చేసావు" అని మెచ్చుకుంటాడు.

భార్యాభర్తలు ఎప్పుడూ తగువులాడుతుంటే షైతాన్‌కు చాలా ఆనందం కలుగుతుంది. ఎందుకంటే భార్యభర్తల మధ్య తగువులాట ఎన్నో కుటుంబాలను విడదీస్తుంది. దైవారాధన నుంచి దూరం చేస్తుంది. మనశ్శాంతి లేకుండా చేస్తుంది.

పిల్లలు, తల్లిదండ్రులు, అత్తామామలు, బంధుమిత్రులు ఇలా ఎందరినో ప్రభావితం చేస్తుంది.

అందుకే "భార్యాభర్తలు ఇరువురు ఒకరి లోపాలను, బలహీనతలను కప్పిపుచ్చుకుంటూ, ఉన్న దాంట్లో సర్దుకుని అన్యోన్యంగా జీవనం సాగించాలి" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స)

భార్యాభర్తల సంబంధాన్ని అల్లాహ్ ఖురాన్‌లో ఒక చక్కని ఉపమానంతో పోల్చాడు.

"మీరు వారికి దుస్తులు. వారు మీకు దుస్తుల లాంటి వారు"

ఎలాగైతే దుస్తులు మన లోపలి లోపాలను కప్పిపుచ్చి, బాహ్య సౌందర్యాన్ని ఇస్తాయో, అలాగే భార్య, భర్త లోపాలను, భర్త, భార్య లోపాలను దాచి పెట్టి, ఒకరి గౌరవాన్ని మరొకరు పెంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే వారి జీవన పయనం సాఫీగా సాగిపోతుంది. వారు ఇరువురు నడిపే నావలో అమ్మ – నాన్న, అత్త – మామ, పిల్లలు, బంధువులు ఎలాంటి బాదరాబందీ లేకుండా ఆడుతూ పాడుతూ ఆనందంగా పయనిస్తారు.

చీటికీ మాటికి తగువులాడుతూ, ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేయడం, అలగడం, ఇంటి పరువు బజారు పాలు చేయడం వల్ల, వారిరువురికి మనశ్శాంతి ఉండదు, ఇంటిల్లిపాదికీ మనశ్శాంతి లేకుండా పోతుంది.

## అనుమానం పెనుభూతం

"అతిగా అనుమానించకండి కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి." అని ఖురాన్‌లో స్వయంగా అల్లాహ్‌నే సెలవిచ్చాడు.

ఈ అనుమానాలే నేడు అనేక కుటుంబాలను కూల్చేస్తున్నాయి. ముఖ్యంగా భార్యకు భర్త మీద, భర్తకు భార్య మీద నమ్మకం ఉండాలి.

ప్రతి చిన్న విషయానికి అనుమానిస్తూ కూర్చుంటే ఆ సంసారం నాలుగు కాలాలపాటు నిలవడం చాలా కష్టం.

భార్యా భర్తలు ఇద్దరూ ఒకరి ఆనందం కోసం మరొకరు తమ తమ సంతోషాన్ని త్యాగం చేసి చూడండి ఇరువురి జీవితాల్లో ఆనందమే ఆనందం.

వారిరువురి త్యాగం ఇరు కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపుతుంది. తద్వారా సమాజంలో శాంతి, ఆనందాల హరివిల్లు వస్తుంది.

అందుకే ఇస్లాం భార్యా భర్తలు ఇద్దరినీ స్వార్థం వీడి, ఒకరి కోసం ఒకరు జీవించమని ఆదేశించింది.

"భర్త తన భార్య నోటికి అందించే ప్రతి ముద్ద కూడా ఒక పుణ్యమే" అని చెప్పి భార్య సంతోషం కలిగించే ప్రతి పని పుణ్యంగా భావించేలా చేసారు ప్రవక్త ముహమ్మద్(స).

అలాగే భర్త తన వైపు చూసినప్పుడు భార్య చిరునవ్వుతో స్వాగతించాలని, వ్యామోహం కలిగేలా అలంకరణ చేసుకోవాలని తెలిపారు.

ఒక నిజం చెప్పనా, మగాడు పైకి వీరుడు ధీరుడిలా కనిపిస్తాడు. భార్య ప్రేమ, అనురాగం ముందు ఉట్టిగానే చిత్తైపోతాడు.

ప్రతి చిన్న విషయానికి చిర్రుబుర్రులాడటం వల్ల నష్టమే కానీ లాభం లేదని గ్రహించాలి. లేని దానికోసం పరుగులు పెట్టడం కన్నా, ఉన్నంతలో సర్దుకుని జీవించడంలో ఉన్న ఆనందమే వేరు.

అన్నింటికన్నా ముఖ్యంగా ఈ జీవితం శాశ్వతం కాదు. శాశ్వత జీవితం మరణానంతర జీవితం. ఇక్కడి సుఖాలు, సంతోషాలు క్షణ భంగురం. ఏ క్షణాన మన సంతోషం, దుఃఖంగా మారుతుందో తెలియదు.

అందుకే దుఃఖాన్ని సంతోషంగా మలుచుకుని ఆనందంగా జీవించాలి. మన బంధుమిత్రులందరికి ఆనందాన్ని పంచాలి.

భార్యాభర్తలు చెట్టుకు ప్రధాన వేరు లాంటి వారు. మీరు బాగుంటే, వంశము అనే చెట్టు పచ్చగా, రంగురంగుల పూలతో, రుచి కరమైన ఫలాలతో, చల్లని నీడను ఇస్తుంది.

మీరు మీ కర్తవ్యం మరచి పోతే చెట్టు మోడు వారిపోతుంది.

ఇస్లాం బోధనలకు అనుగుణంగా మన సంసారం అనే పడవను నడిపి, శాశ్వతమైన పరలోక జీవితం స్వర్ణమయం చేసుకుందాం. ❖

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

37 ఆయత్‌లు

# 45. అల్ జాసియ

మక్కా అవతరణ

25 – 27 మరి మా విస్పష్టమయిన వచనాలు వీరికి వినిపించినప్పుడు[35] వీరివద్ద ఒక్క పిడివాదం తప్ప మరేమీ ఉండదు, అంటే, మా తాతముత్తాతల్ని లేపుకు రా, నీవు చెప్పేది నిజమే అయితే[36] అన్నది. ప్రవక్తా, వీరికి చెప్పు అల్లాహ్ మాత్రమే మీకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు, తిరిగి ఆయనే మీకు మృత్యువునిస్తాడు,[37] తిరిగి ఆయనే మిమ్మల్ని ఆ ప్రళయదినాన సమావేశపరుస్తాడు, దాని రాకలో ఎటువంటి అనుమానం లేదు,[38] కాని చాలామంది ఎరుగరు.[39] భూమీ ఆకాశాల సామ్రాజ్యం అల్లాహ్‌కే చెందినది,[40] మరే దినానయితే ప్రళయ ఘడియ వచ్చి నిలుస్తుందో ఆ రోజున మిథ్యారాధకులు నష్టంలో పడిపోతారు.

28 – ఆ రోజున నీవు ప్రతి వర్గాన్ని మోకాళ్ళ మీద పడి ఉండగా చూస్తావు.[41] ప్రతి వర్గాన్ని పిలువడం జరుగుతుంది, వచ్చి తమ ఆచరణా పత్రాన్ని చూసుకోవాలని. వారికి చెప్పడం జరుగుతుంది: "నేడు మీకు, మీరు చేస్తూ ఉన్న ఆచరణలకు ప్రతిఫలం ఇవ్వబడుతుంది."

35. అంటే, పరలోకం సాధ్యం అనడానికి పటిష్ఠమయిన హేతుబద్ధ ఆధారాలున్న ఆయత్‌లు అన్నమాట. వాటిలో పరలోకం సంభవించడం విజ్ఞత, న్యాయాలరీత్యా తప్పనిసరి ఆవశ్యకత అని, అది సంభవించకపోతే ఈ విశ్వవ్యవస్థ అంతా అర్థరహిత మయిపోతుందని తెలుపబడి ఉంది.

36. మరో మాటలో వారి ఈ వాదనకు భావమేమిటంటే, వారితో ఎవరయినా, మరణానంతర జీవితం ఉందని అన్నప్పు డల్లా అతను తప్పనిసరిగా గోరీ నుండి ఒక మృతుని లేపి తెచ్చి వారి ముందుంచాలని భావం. మరి అలా జరగకపోతే మరణించిన తరువాత మానవులు ఎప్పటికయినా సరికొత్తగా బ్రతికించబడి లేపబడతారన్న విషయాన్ని వారు అసలే నమ్మ లేరు. వాస్తవానికి ఈ ప్రపంచంలో అప్పుడప్పుడు ఒక్కొక్కరుగా మృతులను మళ్ళీ బ్రతికించడం జరుగుతుందని ఎవ్వరూ వారికి చెప్పలేదు. చెప్పినదేమిటంటే ప్రళయానంతరం పరమ ప్రభువు అల్లాహ్ మానవులనందరినీ సరికొత్తగా బ్రతికిస్తాడు, ఎల్లరి ఆచరణలను విచారణ జరిపి ప్రతిఫలమో, శిక్షయో నిర్ణయిస్తాడు అని మాత్రమే.

37. కాల భ్రమణం వల్ల మృత్యువు దానంతట అదే సంభ విస్తుందనే వారి మాటకు ఇది సమాధానం. మీకు బ్రతుకూ యాదృచ్ఛికంగా దొరకలేదు, మృత్యువూ దానంతట అదే సంభవించదు. దేవుడు ఒకడున్నాడు, మీకు జీవితం ప్రసా దించేదీ ఆయనే, దాన్ని పరిహరించేదీ ఆయనే.

38. మా తాతముత్తాతలను లేపి తీసుకురమ్మని వారు చెప్పే మాటకు ఇది సమాధానం. చెప్పేదేమిటంటే అది ఇప్పుడు జరుగదు, ఒక్కొక్కరికి వేర్వేరుగానూ జరగదు, అందరినీ ఏకత్రం చేసే ఒక రోజు నిర్ణయమయి ఉంది.

39. అంటే, జనుల పరలోక తిరస్కారానికి అసలు కారణం అజ్ఞానం, ఆలోచన, అవలోకనాల లోపమే. లేకపోతే పర లోకం సంభవించడమన్నది కాదు, సంభవించకపోవడ మన్నది బుద్ధి కందని విషయం. విశ్వవ్యవస్థను, స్వయంగా తన ఉనికిని ఎవరయినా సరయిన విధంగా పరిశీలిస్తే అతనికి అదే అవగతమయిపోతుంది, పరలోకం సంభవిం చడంలో ఎటువంటి సందేహమే లేదని.

40. పూర్వోత్తర విషయాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే ఈ వాక్యం వల్ల దానంతట అదే ఈ భావం వ్యక్తమవుతుంది – ఈ మహా వైభవోపేతమయిన విశ్వాన్ని పరిపాలించే దైవం సృష్టి సామర్థ్యానికి ఇది ఏమంత కష్టమయిన పనికాదు, ఏ మానవులనయితే ఆయన పూర్వం పుట్టించాడో వారికి మళ్ళీ ఉనికి కల్పించడం ఆయనకు సులభ సాధ్యమే.

41. అంటే, అక్కడ పునరుత్థాన మైదానంలో భయోత్పాతం, దైవన్యాయస్థానంలోని ఠీవి, మహత్తు ఎంతగా ఆవహించి ఉంటాయంటే పెద్ద పెద్ద తలబిరుసుగల మొండిజనుల నిక్కు కూడా అంతమయిపోతుంది, అందరూ దైన్యంగా పడి మోకరిల్లి ఉంటారు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## 'తయ్' తెగ ప్రతినిధి బృందం- అదీ బిన్ హాతిమ్(రజి) వృత్తాంతం

**253)** అదీ బిన్ హాతిమ్(రజి)[1] ఇలా వివరించారు: మేము ఉమర్(రజి) పరిపాలనా కాలంలో ఒక బృందం రూపంలో ఆయన దగ్గరకు వచ్చాము. ఆయన మాలోని ఒక్కొక్క వ్యక్తిని పేరు పెట్టి మరీ పిలువసాగారు. అప్పుడు నేను ఆయన గారితో, "అమీరుల్ మోమినీన్! మీరు నన్ను గుర్తుపట్టలేదా?" అని అడిగాను. దానికి ఆయన, "నిన్ను గుర్తు పట్టకపోవటమేమిటి? వీళ్ళంతా అవిశ్వాసులుగా ఉన్న కాలంలో నీవు ఇస్లామ్ స్వీకరించావు. వీళ్ళంతా వైముఖ్యం ప్రదర్శించినప్పుడు నీవు ఇటువైపునకు మరలి వచ్చావు. వీళ్ళంతా విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్న కాలంలో నీవు నమ్మదగ్గ నేస్తంగా నిరూపించుకున్నావు. వీళ్ళంతా సత్యాన్ని త్రోసి పుచ్చుతున్న రోజుల్లో నీవు సత్యాన్ని కనుగొన్నావు" అని సమాధానమిచ్చారు. ఇది విని నేను, "చాలు. ఇక నాకు ఏమైనా ఫరవాలేదు"[2] అన్నాను.

## హజ్జతుల్ వదా[3] (వీడ్కోలు హజ్జ్)

**254)** హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌కు ఇలా వివరించారు: అంతిమ హజ్జ్‌యాత్ర సందర్భంగా మేము ప్రవక్త మహనీయుల(సఅసమ్)వెంట బయలుదేరాము. మేము ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ దీక్ష బూనాము. దైవప్రవక్త(స) తన సహచరులనుద్దేశించి, "ఎవరి దగ్గర 'హదీ' (ఖుర్బానీ పశువు) ఉందో, వారు ఉమ్రాతోపాటు హజ్జ్ కొరకు కూడా ఇహ్రామ్ కట్టుకోవాలి. ఈ రెండింటి క్రియలు నెరవేర్చేవరకూ ఇహ్రామ్ దీక్షను విడనాడకూడదు" అని సూచించారు. నేను ఆయన వెంట మక్కా చేరుకునేసరికి బహిష్టు స్థితికి లోనయ్యాను. అందువల్ల కాబా గృహ ప్రదక్షిణ గానీ, సఫా- మర్వాల సయీ గాని చేయలేకపోయాను. నేను నా పరిస్థితిని గురించి దైవప్రవక్త(స)కు బాధతో చెప్పుకోగా "జడ విప్పుకుని, దువ్వుకో. ఆ తరువాత హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకో. ఉమ్రా మాత్రం చేయకు" అని నాకు సూచించారు. నేను అలాగే చేశాను. మేము హజ్జ్ చేసిన మీదట దైవప్రవక్త, నా సోదరుడు అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్‌తోపాటు 'తన్‌యీమ్' నుండి (ఉమ్రా కొరకు) ఇహ్రామ్ దీక్షబూనడానికి నన్ను పంపారు. "ఇది నీవు చేయలేకపోయిన ఉమ్రా ఖజా" అని ఆయన(స) నాతో చెప్పారు. ఆయిషా(ర.అ) ఇంకా ఇలా అన్నారు: ఎవరయితే కేవలం ఉమ్రా నిమిత్తం ఇహ్రామ్ కట్టుకున్నారో వారు కాబా గృహ ప్రదక్షిణ చేసి, సఫా - మర్వాల సయీ కూడా చేసి ఇహ్రామ్‌ను విప్పేశారు. తరువాత 'మినా' నుండి తిరిగి వచ్చాక వారు (హజ్జ్‌కు సంబంధించిన) రెండవ తవాఫ్ చేశారు. అయితే హజ్జ్‌తోపాటు ఉమ్రా కొరకు కూడా ఇహ్రామ్ కట్టుకున్న వారు ఒకే తవాఫ్ (ప్రదక్షిణ) చేశారు.

253-1. ఈయన 'తయ్' తెగకు చెందినవారు. ఈయన తండ్రి హాతిమ్ తాయి గొప్ప ధర్మదాతగా సుప్రసిద్ధులు.

253-2. అంటే, మీకు నా పరిస్థితి తెలిసి ఉన్నప్పుడు, నా విలువ ఏమిటో మీరు గుర్తించినప్పుడు నన్ను పేరు పెట్టి పిలువకపోయినా ఫరవాలేదు. పూర్వాశ్రమంలో అదీ బిన్ హాతిమ్ క్రైస్తవుడు. ఈయన సోదరీమణిని ప్రవక్త(స) వేగుల వారు బందీగా పట్టుకున్నారు. అయితే దైవప్రవక్త(స) ఆమెకు మేలు చేసి విడుదల చేశారు. ఆ తరువాత తన సోదరీమణి సలహాపై అదీ బిన్ హాతిమ్ మహాప్రవక్త(స) వద్దకు వచ్చి చర్చ జరిపారు. చర్చల అనంతరం ఇస్లామ్ స్వీకరించారు.

3. 'వదా' అంటే 'వీడ్కోలు', 'సెలవు' అని అసలు అర్థం. ఈ హజ్జ్ యాత్ర సందర్భంగా అంతిమ దైవప్రవక్త(స) తన సముదాయానికి అమూల్యమైన ప్రబోధనలు చేసి సెలవు తీసుకున్నారు.

మదీనాకు హిజ్రత్ చేసిన తరువాత దైవప్రవక్త(స) ఒకే ఒక హజ్జ్ చేశారు. అదే హజ్జతుల్ వదా. కాకపోతే హిజ్రత్‌కు పూర్వం ఆయన మూడుసార్లు హజ్జ్ చేశారని కొంతమంది హదీసువేత్తలు వెలికి తీశారు. అంతిమ హజ్జ్ యాత్రకు ఆయన హిజ్రీ 10, జీఖఅద 26వ తేదీన మదీనా నుండి జుహ్ర్ నమాజ్ చేసి బయలుదేరారు. ఈ యాత్రలో ఆయన వెంట దాదాపు లక్షా ఇరవై నాలుగు వేల మంది వరకూ ఉన్నారు. జుల్‌హిజ్జా నెల 4వ తేదీ ఉదయం ఆయన పవిత్ర మక్కాకు చేరుకున్నారు. ఆ సంవత్సరం అరఫా దినం శుక్రవారం నాడు వచ్చింది. ఈ యాత్ర చేసిన మూడు నెలల తర్వాత ఆయన(స) పరమపదించారు.

★★★

అనువాదం - కె.ఎం.ఎ. సుబ్‌హాన్

నాల్గవ భాగము



# మార్గ చిహ్నాలు (నిషానాతె రాహ్)

**(సయ్యద్ సాదతుల్లా హుసైనీ పుస్తకం "ఇఖామతె దీన్ కీ షాహ్‌రాహ్" నుంచి....)**

### జమాఅతె ఇస్లామీ హింద్ - సమాజంపై దాని ప్రభావం

జమాఅతె ఇస్లామీ హింద్ నిరంతరం పని చేసే ఉద్యమం. అనేక కార్యరంగాలలో పని చేస్తుంది. ఈ కారణంగా సమాజంపై జమాఅత్ ప్రభావం కూడా నిరంతరం పని చేస్తూ వుంది. 70 సంవత్సరాల తీవ్రమైన కృషి తర్వాత కూడా, ఇంత పెద్ద దేశంలో మన సభ్యత్వ శక్తి కేవలం కొన్ని వేలల్లో ఉండటం చాలా తక్కువగా భావించబడుతుంది. అయితే జమాఅత్ ప్రభావం, కేవలం దాని కేడర్ లేక యూనిట్ల వరకే పరిమితమై లేదు. జమాఅత్ నిజానికి ఒక సామాజిక ఉద్యమం. ఈ ఉద్యమం భారత సమాజంపై గాఢమైన ప్రభావాన్ని చూపింది. విభిన్న రంగాలలో ఈ ప్రభావం దాని సభ్యత్వశక్తి (మానవ వనరుల శక్తి) కంటే ఎన్నోరెట్లు అధికంగా ఉంది. ఈ విషయాన్ని ప్రొఫెసర్ జాన్ ఎస్‌పోసిటో ఈ క్రింది మాటల్లో అంగీకరించాడు.

"జమాఅత్ సభ్యత్వం–మానవ వనరుల శక్తి కంటే అనేక రెట్లు అధికంగా దాని ప్రభావం సమాజంపై ఉంది. దాని క్రమశిక్షణ, సంఘసేవ, దాని సామాజిక నిబద్ధత, దాని నిజాయితీ, జవాబు దారీతనాలు ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి" (Esposito, JL (2003) Oxford Dictionary of Islam, Newyork, Oxford University Press ; 156)

స్వతంత్ర భారతదేశంలో ముస్లింల చరిత్ర ఉత్సాహభరితంగానూ, సాహసోపేతంగానూ ఉండింది. దేశ విభజన పిదప ఈ దేశపు నేల ముస్లింల కోసం కుంచించుకొని పోతున్నట్లు అనిపిస్తోంది. ఇక్కడ వారి భౌతిక అభివృద్ధి, ధార్మిక ఉన్నతి సరేసరి కనీసం వారు జీవించడం కూడా కష్టతరం అయ్యే పరిస్థితులు కల్పించ బడుతున్నాయి. పాకిస్తాన్, ద్విజాతివాద జాత్యాహంకారులు, ఈ ప్రచారం ముమ్మరం చేస్తూ తమ శక్తు లన్నింటినీ వెచ్చిస్తున్నారు. దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతాన్ని ఈ శక్తులు తమకు అనుకూలంగా మలుచుకునే కుట్రలు తీవ్రంగా చేస్తున్నారు. అయితే ఈ దేశ ముస్లింలు మాత్రం తమ పూర్తి నిబద్ధతతో, ఉత్సాహంతో ఈ దేశాభివృద్ధిలో పాలుపంచుకుంటూ వున్నారు. తమ దేశం పట్ల వారి ప్రేమ, దాని సభ్యతా సంస్కృతుల పట్ల వారి గౌరవం, జాతి ప్రయోజనాల కోసం వారి త్యాగం, ఇతర దేశ ప్రజల సేవల విషయంగా ముస్లిం సమాజం ఎప్పుడూ ముందు వరుసలోనే నిలిచింది. జాత్యాహంకారుల విద్వేష అబద్ధ ప్రచారాన్ని తమ ఆచరణలో అబద్ధంగా నిరూపిస్తూనే ఉంది. ఈ సుదీర్ఘ చరిత్రలో ముస్లింలు అనేక రంగాలలో నిర్లక్ష్యానికి గురయ్యారు. నేడు, ముస్లింలు, విద్య, ఆర్థిక, రాజకీయ, తదితర రంగాలలో వీరి ప్రభావం మృగ్యంగా కనపడుతుంది. స్వాతంత్ర్య పోరాటకాలంలో కన్నా వీరి ప్రభావం అనేక రెట్లు తగ్గినట్లు మనం గమనిస్తున్నాం.

నేడు ముస్లింలు ఒక వెనుకబడిన వర్గంగా భావించబడుతున్నారు. తమ బలహీనతల కారణంగా నిత్యం దౌర్జన్యాలకు అవమానాలకు, దాడులకు గురౌతున్నారు. ఇన్ని బలహీనతలు, దుస్థితులు ఉన్నప్పటికీ, అనేక సవాళ్ళు ఎదురైనప్పటికీ, భారతదేశ ముస్లిం సమాజం తన చరిత్రలో అనేక కోణాలలో గర్వించదగిన స్థానం కలిగి ఉంది. ఇందుకు ముస్లిం సమాజంలోని అనేక సామాజిక, సేవా రాజకీయ సంస్థల సంస్కరణాత్మక కృషి, మార్గదర్శకాలు ప్రధానపాత్రను పోషించాయి. ఇంకా, సోదర దేశవాసులలోని మెజారిటీ ప్రజలు. ఇక్కడి సోదరత్వ సభ్యతకు, సామాజిక భద్రతకు, సెక్యులర్ భావాలకు, రాజ్యాంగ విలువలకు కట్టుబడి తమ తమ బాధ్యతలను పోషించాయి. భారతదేశ ముస్లింల పూర్తి చరిత్రలో జమాఅతె ఇస్లామీ హింద్ పాత్ర – సంబంధం, ప్రాధాన్యత కలిగి ఉంది. తమ పరిమిత సంఖ్యా బలంతోనే జమాఅత్, తన శక్తివంతమైన దృక్పథం, భావన, విశ్వాసాల పునాదులపై నిలిచింది. తన వనరుల సద్వినియోగం, సాహిత్య సంపద శక్తితో దేశవ్యాపితంగా తన నెట్‌వర్క్‌ను నిర్మాణాత్మకంగా విస్తరించింది. నిత్యం ప్రజలతో సజీవ సంబంధాలను కొనసాగించింది. ఈ దేశ ముస్లింల సామూహిక జీవితాలపై తనదైన బలమైన ముద్రలను వేసింది. ఆలోచనల్లో, భావనల్లో, ఆచరణల్లో గుణాత్మక మార్పులను తెచ్చింది.

స్వాతంత్ర్యానంతరం తక్షణమే జమాఅత్ ఇతర ధార్మిక సంస్థలతో మేధావులతో కలిసి ముస్లిం సమాజంలో ఉత్సాహం, నమ్మకం, కల్పించే కృషిలో నిమగ్నమయ్యింది. ఈ పనిలో ముందస్తుగా ముస్లింలను ఈ దేశపౌరులుగా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించే వైపునకు మళ్ళించింది. ఆ కాలపు జమాఅత్ సాహిత్యం, రచనలు, బాధ్యుల ప్రసంగాలను పరిశీలిస్తే తెలిసే విషయం ఏమంటే, ఆ కాలంలో జమాఅత్ అప్పటి ముస్లింలలో తాము ఈ దేశ పౌరులుగా, గౌరవంగా, తమ ధార్మిక విశ్వాసాలను నిరభ్యంతరంగా నిర్వర్తించుకోవచ్చు అనే ధైర్యం, భావనలు కల్పించింది. అదే సమయంలో గతంలోనూ, వర్తమానంలోనూ, వారికి నష్టదాయకంగా మారిన వర్గ (ఫిర్ఖా) విభజన నుండి ఉపద్రవాల నుండి దూరంగా ఉంచేందుకు వారిలో ఇస్లామీయ చైతన్యం కలిగించేందుకు తీవ్రంగా కృషి చేసింది. ఉదాహరణకు జమాఅత్ నిర్మించబడిన వెంటనే అప్పటి అమీరే జమాఅత్ మౌలానా అబుల్ లైస్ ఇస్లాహి (రహ్మ) ప్రసంగం అప్పటి జిందగీ పత్రికలో ముద్రించబడింది. అందులో ఆయన ఈ దేశ ముస్లింలు ఈ దేశ పౌరులుగా, ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో జీవించవలసి నదిగా పిలుపునిచ్చారు. అదే సమయంలో ఇస్లాంలో లేని ఫిర్ఖా, వర్గ పోరాటాల నుండి దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఇస్లామీయ మౌలిక సిద్ధాంతాల జ్ఞానాన్ని పొంది ఈ దేశాభివృద్ధిలో ప్రజా సేవలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. *(మౌలానా అబుల్ లైస్ ఇస్లాహీ – ఇండియన్ యూనియన్ మెం ముసల్మానోం కా ముఖామ్–జిందగీ–రాంపూర్ – నవంబర్ 1948, 44 నుండి 48 పేజీలు)*

జమాఅత్ ఈ విపత్కర పరిస్థితుల్లో ఇతర ధార్మిక సంస్థలు, నాయకులతో కలసి ముస్లింలకు ధార్మిక శిక్షణ ద్వారా వారి సాంస్కృతిక, సభ్యతలను పరిరక్షించే కృషి చేసింది. జాత్యాహంకారుల దాడులను ఎదుర్కొంటూ నిలిచింది. దేశంలో గౌరవంగా జీవించవచ్చనే భావనను ఉమ్మత్‌లో పాదుగొల్పింది. అందుకు మార్గాలను సుగమం చేసింది. ఫలితంగా భారతీయ ముస్లింల సామూహిక జీవితాలలో ప్రత్యేకించి కొన్ని అంశాలలో జమాఅతె ఇస్లామీ హింద్ ప్రభావం చాలా బలంగా ఉంది.

జమాఅతె ఇస్లామీ హింద్ విద్యావంతులైన ముస్లింలలో ధార్మిక చైతన్యాన్ని రగిలించింది. ధర్మం కోసం, దేశం కోసం, ముస్లిం సమాజం కోసం మడమ తిప్పని కృషి చేసేవారిగా, త్యాగాలు చేసేవారిగా వీరిని తీర్చిదిద్దింది, ఉత్సాహాన్ని నింపింది. విద్యావంతులైన మధ్యతరగతి ప్రజలు ఒక ప్రజాస్వామిక సమాజంలో అత్యంత ప్రభావశీలమైన పాత్ర పోషించేవారుగా ఉంటారు. సామాజిక మార్పులకు అవసరమైన వనరులు సాధారణంగా వీరివద్దనే ఉంటాయి. ఒక చైతన్యవంతమైన మధ్యతరగతి వర్గం పూర్తి సమాజాన్ని చైతన్యవంతమైనదిగా మార్చగలదు. ఈ మధ్యతరగతి విద్యావంతులే జమాఅతె ఇస్లామీ హింద్‌కు మొదటి నుండీ దేశంలోని అధిక ప్రాంతాల్లో మానవవనరుగా ఉన్నారు. జమాఅత్ కళాశాలలు, యూనివర్శిటీలలోని విద్యార్థులను ధార్మికత వైపునకు మరల్చింది. ఈ రంగంలో జమాఅత్ సాహిత్యం చేసిన అద్భుత కృషిని మేధావులందరూ ప్రశంసించారు, అంగీకరించారు కూడా. మౌలానా అబుల్ హసన్ అలీ నద్వి (రహ్మ) ఈ విషయాన్ని ఈ క్రింది విధంగా స్పష్టం చేశారు. "ఇరవయ్యవ శతాబ్దానికి ప్రారంభ అర్ధ శతాబ్దంలో మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూదీ తన ప్రఖ్యాత పత్రిక 'తర్జుమానుల్ ఖుర్ఆన్' (హైదరాబాద్) లోని వ్యాసాల ద్వారా ముస్లింలలోని విద్యావంతుల సమూహాన్ని విశేషంగా ప్రభావిత పర్చారు. పాశ్చాత్య సంస్కృతి, పాశ్చాత్య జీవన విధానపు ఖండన మరియు విమర్శకోసం, ఇంకా పాశ్చాత్య విద్యావిధానంతో జనించిన అభ్యుదయవాద ఉద్యమం, దాని ఆలోచనలు తద్వారా ఉనికిలోకి వచ్చిన జాతీయవాదాన్ని ఎండగట్టడానికి, త్రిప్పికొట్టడానికి రాయబడిన ఈ రచనలు 'ఆత్మరక్షణ'గా కాకుండా 'ముందుకెళ్ళి దాడిచేసే' పంథాలో దర్శనమిస్తాయి. వీటితోపాటుగా అభ్యుదయవాదుల విమర్శలకు ప్రత్యేకంగా గురి అవుతున్న ఇస్లామీయ షరీఅత్, ఇస్లామీయ చట్టాలకు సంబంధించిన వివిధ అంశాలు; ఉదాహరణకు వడ్డీ, పరదా, జిహాద్, ఖుర్బానీ (త్యాగమయ బలిదానం), బానిసత్వం, హదీస్, సున్నత్‌లు (ప్రవక్త ప్రవచనాలు, సంప్రదాయాలు) వంశ, కౌటుంబిక చట్టాలు (Personal Laws) మొదలగు గాగల శీర్షికలు, చర్చలపై కూడా సైద్ధాంతిక, ప్రభావ పూరితమైన రచనలు చేశారు. ఆ తరువాత, అచ్చు పుస్తకాలుగా, గ్రంథాలుగా వెలువడిన ఈ రచనల ద్వారా

ఆధునిక విద్య అభ్య సించిన, మేధావితనం గల యువ వర్గంలో, ఇస్లాం విలువలు, భావనలు, ఆలోచనల్ని పునఃప్రతిష్ఠించటంలో, సదరు యువ వర్గాన్ని ఇస్లాం, మరియు ఇస్లామీయ బోధనలపట్ల ఏర్పడిన న్యూనతాభావం నుండి, పరాజిత మనస్తత్వం నుండి కాపాడే ఘనమైన, ఫలదాయకమైన కార్యాన్ని నెరవేర్చారు. ఈ సత్యాన్ని అంగీకరించకపోవటం మహా ఘోరకార్యం. ఈ కారణం గానే ఆ కాలపు కొందరు విజ్ఞులు ఆయన్ను 'ఇస్లాం తరపున మాట్లాడే ప్రతినిధి' (Spoke Person of Islam) అనే బిరుదుతో సత్కరించారు. (మౌలానా అబుల్ హసన్ అలీ నద్వి *(1982) అసర్‌మె దీన్, తఫ్‌హీమ్ వ తష్‌రీహ్–కరాచీ–మజ్లిసె నషర్ యాతె ఇస్లామ్ – పుట 20)*

ధర్మంపై నమ్మకం, స్థిరత్వం ఏర్పర్చిన జమాఅత్, దేశం, ఉమ్మత్‌ల నిర్మాణం, పరిరక్షణ – ప్రగతుల గురించి వారికి ఆచరణాత్మక కార్య ప్రణాళికను అందించింది. జమాఅత్ ఈ వర్గాన్ని, ముస్లిం అయిన కారణంగా వారి బాధ్యతలు తెలియ పర్చింది. ఇస్లామీయ సందేశ ప్రచారవిధిని నిర్వర్తించే, ప్రజలకు మార్గదర్శకత్వపు నాయకత్వం అందించే విషయాలను విశద పర్చింది. మానవుల సమస్యలు, వాటి పరిష్కారాలు, శుభ–సంక్షేమాల సాధనకోసం, శ్రమించడం వగైరాలను వీరికి అర్థవంతంగా వివరించింది. ఇది వీరి ధార్మిక విధి అనీ భారత దేశపు ప్రజాస్వామిక వ్యవస్థలో ఈ నిర్మాణాత్మక కృషికి మెండైన అవకాశాలున్నాయని తెలిపింది. ఒక సుదీర్ఘ కాలం వరకు దేశ వ్యాపితంగా జమాఅత్ స్టడీసర్కిళ్ళు, సమావేశాలు, సభల ద్వారా ఒక తరం ఆలోచనలను ప్రభావితం చేసింది. శిక్షణ గరిపింది. తద్వారా వీరిలో ఆచరణాత్మక కృషిచేసే చైతన్యాన్ని రగిలించింది. ఫలితంగా నేడు దేశవ్యాపితంగా ప్రతి నగరంలోనూ మేధావులైన ఈ విద్యావంతులు, విద్య, సందేశ, రాజకీయ, సామాజిక సేవల్లో తమ వంతు కృషి చేస్తున్నారు. వీరిలో చాలామంది జమాఅత్‌తో సంబంధం కూడా లేనివారున్నారు. కాని వారి శిక్షణ మాత్రం జమాఅత్ తన సాహిత్యం ద్వారా, తన ఆలోచన ద్వారా చేసింది. విద్యారంగంలో దీన్ – దునియా అనే అహేతుక విభజనకు జమాఅత్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ధార్మిక, సాంకేతిక విద్యల మేలు కలయిక గల విద్యా విధానాన్ని ఉమ్మత్‌కు అందించింది. ఆర్థిక రంగంలో వడ్డీలేని స్వచ్ఛమైన రుణ వ్యవస్థను ప్రతిపాదించింది. (వీలైన చోట్లల్లో తనదైన శక్తితో ఆచరణకు పూనుకొంది). ఇక రాజకీయ రంగంలో నైతికత, పారదర్శకత, నీతి, నిజాయితీలకు, సమన్యాయం, శాంతి, సంక్షేమాల స్థాపనకు ఇస్లామీయ సూత్రబద్ధతలను పరిచయం చేసింది. ఇక ముస్లిమేతర సోదర దేశవాసులతో స్నేహ పూర్వక, గౌరవనీయ సంబంధాలకు పెద్దపీట వేసింది. వారికి ఇస్లాం పరిచయం చేయడం, సందేశం ఇవ్వడం, వారి అనుమానాలు, అపోహలు తొలగించే కృషి చేయడానికి నేటి ఆధునిక పద్ధతుల వినియోగాన్ని అందించింది.

ఇస్లామీయ చరిత్ర, పరిశోధన, సాహిత్య సృజన ఇస్లామీయ మౌలికాంశాల పునాదులపై, దేశం, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధానాలను ప్రపంచా నికి అందించింది. ఇస్లాంను ఒక ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థగా ప్రపంచం ముందు ప్రతిపాదించింది. జమాఅత్ ఒక తరానికి పూర్తిగా శిక్షణ గలిపింది. తర్ఫీదునిచ్చింది. తద్వారా నూతనో త్సాహం, సరికొత్త కలలు కనే తత్వాన్ని వీరిలో రగిలించింది. నేడు ఈ తరం అనేక మైదానాలలో, జీవన రంగాల్లో, విభిన్న పద్ధతుల్లో తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంది. నాడు జమాఅత్ కన్న కల, సుందర సమాజ స్వప్నం నేడు అందరి ఆశయంగా మారింది.

జమాఅత్ చేసిన మరో గొప్ప సేవ ఏమంటే, భారతదేశంలోని ముస్లింలలో, నిర్మాణాత్మకమైన, సంతులనమైన ఇస్లామీయ ఆలోచనలను ఉన్నత స్థానానికి చేర్చింది. పరిస్థితుల కఠినత్వం జాతులలో తీవ్రవాదాన్ని ప్రేరేపిస్తాయి. భారత ముస్లింలకు స్వాతంత్ర్యానంతరం కఠినమైన పరిస్థితులు అనేకం ఎదుర య్యాయి (అవుతూ వున్నాయి) దేశ విభజన బాధను అనుభవించాల్సి వచ్చింది. ఘర్షణలు, వాటి బాధలను అనుభవిం చాల్సి వచ్చింది. ఫలితంగా వారి సామాజిక హోదా త్వరత్వరగా పతనం వైపుకు పయనిస్తూ పోయింది. బాబరీ మస్జిద్ విధ్వం సాన్ని చూడటం జరిగింది. తీవ్రవాదం పేరుతో విభిన్న ప్రాంతాల లోని ముస్లింలు వేధింపులకు గురయ్యారు. ఈ కఠిన పరిస్థితులు ఎన్ని ఎదురైనా సర్వసాధారణంగా ముస్లింలు సంతులన, సహజీవన మార్గాన్ని అనుసరించారు. ఈ క్రమంలో జమాఅత్ సత్సంబంధాలు ఇతరులతోనూ, ఉమ్మత్‌లోని ఇతర సంస్థల తోనూ ప్రభావశీలంగా పని చేసాయి. దేశవ్యాప్తంగా జమాఅత్ సంతులనమైన మధ్యస్థ మార్గాన్ని, సహనవైఖరిని విస్తృతంగా ప్రచారం చేసింది. ఫలితంగా దేశవ్యాపితంగా తీవ్రవాద ప్రచా రాన్ని, దానివైపు ప్రజలు మరలడాన్ని జమాఅత్ నిరోధించ గలిగింది. సంతులితమైన ఆచరణను ప్రజలకు అందించింది. స్వాతంత్ర్యానంతరం తక్షణ కార్యాచరణను జమాఅత్ తన పాలసీ ద్వారా అమలుపర్చింది. అందులో వర్గ వైషమ్యాలకు, చరమ గీతం పాడటం ప్రధాన అంశంగా ఉండింది. మరెక్కడైతే అధిక సంఖ్యాకుల జాత్యాహంకార నిరోధానికి కృషిచేసిందో, అదే విధంగా ముస్లింలలోని జాతి విద్వేషాన్ని కూడా నిరసించింది. వారి సంస్కరణకు తీవ్రంగా కృషి చేసి సఫలత పొందింది. (జిందగీ మాసపత్రిక – జమాది ఉల్ అవ్వల్ 1976, రాంపూర్, 119 నుండి 128 పుటలు) నేడు కూడా అంతర్జాతీయంగా తీవ్రవాద నిరోధానికి జమాఅత్ తన శక్తివంచన లేకుండా కృషిచేస్తుంది. భారత ముస్లింలు నేడు ఈ తీవ్రవాద పిశాచి నుండి పూర్తి రక్షణాత్మక స్థితిలో ఉన్నారు. ఈ విషయాన్ని స్వయానా ప్రభుత్వాధినేతలే అంగీకరించారు.

**(మిగతా వచ్చే సంచికలో)**


'చరితార్థులు'-2



# బేగం సోఫియ సోం

## (1916 -1961)

77




**భారత జాతీయ కాంగ్రెస్** పిలుపు మేరకు జాతీయోద్యమంలో అపూర్వ సేవలందించి, కార్యదక్షత ప్రదర్శించిన అరుదైన మహిళా నేతగా ఖ్యాతిగాంచిన బేగం సోఫియ సోం 1916లో బొంబాయిలో జన్మించారు. చిన్నతనం నుండి భారత జాతీయ కాంగ్రెస్ మహిళా విభాగానికి చెందిన నేతలతో కలిగిన పరిచయాల వలన ఆమె కూడా భారత జాతీయ కాంగ్రెస్ స్వచ్ఛంద సేవా కార్యకర్తల విభాగంలో పని చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ మహిళా స్వచ్ఛంద సేవాకార్యకర్తల జాతీయ స్థాయి అధ్యక్షురాలిగా, పర్యవేక్షకురాలిగా, నాయకురాలిగా ఆమె రాణించారు. జాతీయోద్యమ కార్యక్రమాలలో పాల్గొంటున్నప్పుడే, ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ సోదరుని కుమారుడు ఇంజనీర్ ఖాన్ సాదుల్లా ఖాన్‌ను సోఫియ సోం వివాహం చేసుకున్నారు. ఖాన్ సాదుల్లా ఖాన్ బొంబాయి కార్పొరేషన్‌లో ఇంజనీర్ మాత్రమే కాకుండా, నాన్న, చిన్నాన్నలాగే స్వాతంత్ర్య సమరయోధుడు. 1935 జనవరి 26నాటి తన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, వివాహం తరువాత భర్త ప్రోత్సాహంతో సోఫియా తన ఇష్టానుసారం దేశం కోసం మరింత బాగా సేవలందించగలదు, అని మహాత్మాగాంధీ ఆశాభావం వ్యక్తంచేశారు. ఆమె వివాహం రోజున తన వ్యక్తిగత కార్యదర్శి మహాదేవ దేశాయి ద్వారా రాయించిన లేఖలో గాంధీజీ నూతన వధూవరులకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

బేగం సోఫియ సోం భర్త సాదుల్లా ఖాన్ కుటుంబీకులంతా స్వాతంత్ర్య సమర యోధులు కావటంతో జాతీయోద్యమంలో మరింత చురుకుగా పని చేయడానికి ఆమెకు ప్రోత్సాహం లభించింది. మహాత్ముని సలహా మేరకు జాతీయోద్యమంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడానికి మహిళా స్వచ్ఛంద సేవా కార్యకర్తలలో శారీరక పటిష్టత, మానసిక పరిపక్వత కలుగ జేయడానికి అధ్యయన, శిక్షణా శిబిరాలను ఆమె నిర్వహించారు. ఆంగ్ల ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్న కారణంగా ఆమె పలుసార్లు జైళ్ళ పాలయ్యారు. బొంబాయి నగరం నుండి బహిష్కరణకు కూడా గురయ్యారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు ఆమె యరవాడ జైలులో నిర్బంధించ బడ్డారు. ఆమె జైళ్లలో ఉన్నప్పటికి ధార్మిక ఆచరణకు ఏమాత్రం భంగం కలుగనియ్యలేదు. ఆంగ్లేయుల వ్యతిరేక ప్రచారాన్ని విరమించలేదు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా ఖద్దరు ధారణ మానకుండా మనసా వాచా మహాత్ముని బాటన నడిచిన బేగం సోఫియ సోం 1961 మార్చి 16న కన్నుమూశారు. ✤

✤

# కవిత్వంతో కరచాలనం



- యండి. ఉస్మాన్ ఖాన్

**కవిత్వం అనేది మనిషి ఆలోచనలకు, భావాలకు, అనుభూతులకు ప్రతిబింబం.**

శైలి, శిల్పం, స్వరాల అన్వయంతో భావాలను వ్యక్తీకరించే ఒక కళ. ఇది ఒక వ్యక్తి లేదా సంఘం ఆలోచనల్ని, సందేశాన్ని చాలా సున్నితంగా, మానసికంగా, అనుభవాత్మకంగా పాఠకులకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

ప్రపంచంలోని వివిధ సంస్కృతులు, భాషలు, సమాజాలు అన్నింటినీ కలిపి ఒక సమిష్టి సాహిత్యాన్ని నిర్మిస్తే అది కవిత్వమవుతుంది. కవిత్వం జ్ఞానానికి, ప్రేమకు, తాత్వికతకు, పోరాటాలకు వేదిక. మొన్న మొన్ననే మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవాన్ని జరుపుకున్నారు. దీని అసలు ఉద్దేశ్యం కవిత్వమనే కళను ప్రోత్సహించటం, కవిత్వం పట్ల మక్కువను పెంచడం, దాన్ని ప్రాచుర్యంలోకి తేవడం, ప్రపంచంలోని వివిధ భాషా, సంస్కృతుల్లోని కవిత్వ ప్రక్రియల్ని, సంప్రదాయాల్ని గుర్తించి, విస్తృతంగా చర్చించడం. కవిత్వం మనసు లోతుల్లోని భావాలను, ఆలోచనలను, అనుభూతులను ప్రామాణికమైన, అనుభవపూర్వకమైన శైలిలో వ్యక్తం చేసే ఒక గొప్ప అపురూపమైన కళా ప్రక్రియ. కవిత్వం ప్రకృతి, ప్రేమ, విరహం, దుఃఖం, నైతికత, సామాజికత, రాజకీయ, ఆర్థిక, ఇతర అనేక అంశాలను స్పృశిస్తూ, వివరిస్తూ ప్రపంచంలోని విభిన్నతలను అంగీకరించి, అవి మన జీవితంపై ఎలా ప్రభావం చూపిస్తాయో సంక్షిప్త పదాల్లో సమగ్రంగా తెలియజేస్తుంది. కవిత్వం మనకో రసవత్తర దృష్టిని కలిగిస్తుంది.

### రవి గాంచని చోటు కవిగాంచును...

కవులు మన మనస్సుల్లోకి ప్రవేశించి మన ఊహలు, ఆశలు, కలల ద్వారా ప్రయాణిస్తూ, అనిర్వచనీయమైన అద్భుత లోకంలో విహరింపజేస్తారు. వయోభేద, సమయ, కాల, స్థానాలను మించిన ఒక సౌందర్యమైన అనుభూతిని పంచుతారు. అందులో భావుకత, ఉద్వేగం, సృజనాత్మకత, జ్ఞానం లాంటి మిశ్రమాలు మిళితం కావడంతో కవిత్వంతో కరచాలనం చేసిన ప్రతిసారీ మనం అనేక కోణాల్లో వినూత్న అనుభూతులను ఆస్వాదిస్తాం, అనుభూతిస్తాం. కవిత్వం కేవలం ఒక రచన మాత్రమే కాదు, మనోభావాలను, సామాజిక సమస్యలను, ప్రకృతి సౌందర్యాలను, వ్యక్తిగత అనుభూతులను వ్యక్తం చేసే ఒక అద్భుతమైన మార్గం. కవిత్వం ప్రధాన లక్షణం అనుభూతి. కవిత్వం ఒక వ్యక్తి అంతర్గత ప్రపంచాన్ని వెలుగులోకి తెచ్చేందుకు, దాన్ని ప్రపంచంతో అనుసంధానించేందుకు అత్యంత శక్తివంతమైన

సాధనం. ఇది మన సమాజంలో భావోద్వేగాల, సంస్కృతి, సామాజిక న్యాయం, మార్పును ప్రేరేపించడానికి గొప్ప సామర్థ్యం కలిగి ఉంది. నిజానికి మనకు తెలియకుండానే కవిత్వం మన జీవితంలో ఒక భాగంగా ఉంది. ఇది మన చింతనలను, సంస్కృతిని, మన జ్ఞానాన్ని మరింతగా పెంచుతుంది.

### కవిత్వానికి భాషాభేదం లేదు..

కవిత్వానికి భాషాభేదం లేదు. ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ, అనేక ప్రక్రియల్లో కవిత్వం రాయబడుతోంది. ప్రతి భాషకు, ప్రతి సంస్కృతికి కవిత్వ పద్ధతులు, భావనలు, అభిప్రాయాలు, ప్రయోజనాలు మారిపోతాయి. ఒక కవి తన భాషలో, తన సంస్కృతిలో మాత్రమే కాకుండా పర భాషలో కూడా తన భావాలను, అనుభూతిని వ్యక్తం చేయగలడు. కాని మాతృ భాషలో మాత్రం కవిత్వాన్ని మరింతగా రంజింపచేయగలడు. కవిత్వం ప్రజలలో మానవతా విలువలను ప్రోదిచేస్తుంది. కవిత్వం ద్వారా, మానవ హక్కులు, సమానత్వం, ప్రేమ, శాంతి, సోదరభావం, సహానుభూతి వంటి అంశాలను కవులు ప్రపంచం ముందుకు తీసుకువస్తారు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక సవాళ్ళను అధిగమించగల ప్రభావశీల ఆలోచనా విధానాన్ని మంచి కవిత్వం అందించగలుగుతుంది.

కవిత్వం సత్సమాజాన్ని కాంక్షిస్తుంది. పీడన, అణచివేత, అసమానతలను నిరసిస్తుంది. కవిత్వం ద్వారా సమాజం ఎదుర్కొంటున్న కష్టాలు, సంతోషాలు, సవాళ్ళను గమనించవచ్చు. ఇది ప్రగతికి దారి తీస్తుంది, అర్థవంతమైన సంభాషణలకు మూలమవుతుంది. శీల సంరక్షణకు, వ్యక్తిత్వ ఆవిష్కరణకు దోహదం చేస్తుంది. కనుక పిల్లలకు, యువతకు విద్యార్థి దశనుండే మంచి కవిత్వం పట్ల ఆసక్తిని కలగజేస్తే భవిష్యత్తులో వారు మంచి భావుకులుగా, కార్యశీలురుగా తయారయ్యే అవకాశాలు మెరుగు పడతాయి. సమాజం పట్ల మంచి అవగాహన ఏర్పడుతుంది. మానవ స్వభావం, ప్రపంచ పోకడల పట్ల దృష్టికోణం విస్తృతమవుతుంది.

### కవిత్వాన్ని ఆదరించాలి

అందుచేత సమాజాన్ని మంచి మార్పు దిశగా మార్గదర్శకం చేసే కవిత్వాన్ని/సాహిత్యాన్ని అందరూ స్వాగతించాలి, ఆదరించాలి. కవిత్వాన్ని ఒక సామూహిక భావనగా చూస్తూ, భిన్న ప్రక్రియల్లో ఉన్న కవిత్వాన్ని ప్రజలకు పరిచయం చేయాలి. కవుల ఆలోచనలను, అనుభవాలను, రచనలను ప్రపంచంతో పంచుకోడానికి, పరస్పర పరిచయాలకు వారికి అవకాశం కల్పించాలి. చర్చా గోష్టులు, కవి సమ్మేళనాలే అందుకు మార్గం. మరింకెందుకు ఆలస్యం కరచాలనమే కాదు, కవిత్వాన్ని ఆబగా ఆలింగనం చేసుకోడానికి కూడా సిద్ధంకండి.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




**- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ**

**గత సంచిక తరువాయి**

### ఏకాంత ప్రయోజనాలు

**1) అల్లాహ్ స్మరణతో తన్మయం చెందటం** : పూర్వం సజ్జనుల్లో ఒకరు ఒంటరిగా కూర్చుని, అల్లాహ్‌ను స్మరిస్తూ, తన ప్రభువును వేడుకున్నాడు. ఆయన్ను ఇలా ప్రశ్నించడం జరిగింది: మీకు ఒంటరితనం తోచడం లేదా? అని. దానికి ఆయన ఇలా అన్నాడు: అల్లాహ్‌తో గడిపే ఎవరికయినా తాను ఒంటరి అన్న భావన కలగడం సాధ్యమేనా? అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: "నేను నా దాసునితో అతను నా గురించి ఊహించినట్టుగానే వ్యవహరిస్తాను. అతను నన్ను ఎక్కడ గుర్తుచేసుకున్నా నేను అతనికి తోడుంటాను". అల్లాహ్ సాక్షి! మీలో ఎవరికైనా తన వస్తువు అడవిలో తప్పిపోయి తిరిగి దొరికితే అతను ఎంతగా సంతోషిస్తాడో, దాసుడు పశ్చాత్తాప పడినప్పుడు అల్లాహ్ అంతకన్నా ఎక్కువగా సంతోషిస్తాడు. ఎవరైనా నా వైపు ఒక జానెడు దగ్గరకు జరిగితే నేను అతనివైపు మూరెడు దగ్గరకు జరుగుతాను. ఎవరైనా నా వైపు మూరెడు దగ్గరకు జరిగితే నేనతని వైపు బారెడు దగ్గరకు జరుగుతాను. అతను నా వైపునకు నడిచి వస్తే నేనతని వైపునకు పరుగెత్తుకొస్తాను. (బుఖారీ ముస్లిం)

"ఏ రోజయితే ఏ నీడా ఉండదో ఆ రోజున అల్లాహ్ ఏడుగురు వ్యక్తులకు తన అర్ష్ (దైవ సింహాసనం) నీడలో స్థలాన్ని ప్రసాదిస్తాడు. ఆ అదృష్టవంతులలో ఒకరు - ఏకాంతంలో అల్లాహ్‌ను గుర్తు చేసుకుని కంట తడి పెట్టుకున్న వ్యక్తి". (తిర్మిజీ)

**2) ఆత్మప్రక్షాళనం** : ఏకాంతం ఆత్మప్రక్షాళనకు గొప్ప సమయం. ఇబ్న్ అల్-ఖయ్యిమ్ తన పుస్తకం (అల్-ఫవాయిద్)లో ఇలా అన్నారు: "మీరు మీ హృదయాన్ని మూడు చోట్ల వెతుక్కోండి: ఖురాన్ వింటున్నప్పుడు, అల్లాహ్ స్మరణ సమావేశాలలో, ఏకాంత సమయాల్లో. ఈ మూడు ప్రదేశాలలో మీరు దానిని కనుగొనలేకపోతే, మీకు హృదయమే లేదని గ్రహించి, మంచిగా స్పందించే హృదయం ఇవ్వమని అల్లాహ్‌ను వేడుకోండి".

**3) ఆత్మ దర్శనానికి అనువైన సమయం** : నువ్వు అంటే మనసు కాదు, బుద్ధి కాదు, చిత్తం కాదు, అహంకారం కాదు, పంచేంద్రియాలు కాదు... దానం, ఐశ్వర్యం, మందీమార్బలం అసలు కానేకాదు. నువ్వేంతో నీకు తెలిపేదే, తెలిసి వచ్చేలా చేసేదే ఏకాంతం. ప్రతిరోజూ మన ముఖాన్ని, శరీరాన్ని మనం అద్దంలో వీక్షిస్తాము, ఎందుకంటే మనం ఇతరుల ముందు సర్వోత్తమంగా కనిపించాలని కోరుకుంటాము. ఆత్మవిమర్శన, స్వీయ విశ్లేషణ అనే లోపలి దర్పణాన్ని అనుదినమూ చూడటం, పైపై వాలకము వెనుక ఉన్న దాని సరైన ముఖచిత్రాన్ని నిర్ధారించడం మరింత

ముఖ్యం కాదా? ముఖంపై ఒక చిన్న మొటిమ లేదా మచ్చ కూడా ముఖం అందాన్ని పాడుచేసినట్లే, కోపం, భయం, ద్వేషం, అసూయ, ఈర్ష్య వంటి అవలక్షణాల మూలంగా ఆందోళన అధికమయి, ఆత్మ ప్రతిబింబాన్ని వైకల్య పరుస్తుంది. ప్రతిరోజూ ఈ వైకల్యాల నుండి మనల్ని మనం విముక్తం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, మన అంతరాత్మ సౌందర్యం తేజరిల్లుతుంది.

మనం విశ్లేషణ ద్వారా మానవ సమస్యలు మూడు విధాలుగా ఉంటాయని గమనిస్తాము: బాహ్య శరీరాన్ని బాధించేవి, మనస్సుపై దాడి చేసేవి, ఇంకా ఆత్మను కప్పివుంచేవి. రోగం, వృద్ధాప్యం, మరణం శరీరానికి ఎదురయ్యే ఇబ్బందులు. మానసిక వ్యాధులు దుఃఖం, భయం, కోపం, తీరని కోరికలు, అసంతృప్తి, ద్వేషం, భావోద్వేగ వ్యామోహం మానసిక క్యాన్సర్ వంటి వాటి ద్వారా దాడి చేస్తాయి. ఇక అవిద్య, అజ్ఞానం, ధర్మరాహిత్యం అనేది ఆత్మ రుగ్మత. అన్నిటికంటే ఇది అత్యంత హానికరమైనది, ప్రమాదకరమైనది. ఇది అన్ని ఇతర ఇబ్బందులు రావటానికి కారణమవుతుంది. ఆ రకంగా ఏకాంతం ప్రయోజనకర విద్యార్జనకు శుభవేళ.

## ఏకాంత పాపాలతో జర భద్రం!

చీకటి బాగా దట్టమయ్యిందన్న తలంపు కొందరిని చెడు తలుపులు తెరిచేలా ప్రేరేపిస్తే, ఎవడూ గమనించడం లేదు అన్న ధీమా మరికొందరిని పాప కార్యానికి పురిగొల్పుతుంది. నైతిక విలువల వలువలు వలిచేయాలని, కుటుంబ మర్యాదను మట్టిలో కలిపేయాలని, ఆధ్యాత్మిక ఆంక్షల్ని అతిక్రమించాలని, బరువు బాధ్యతలను మరచి బరితెగించి కోరికల మజాలు జుర్రుకోవాలని ఉసిగొల్పుతుంది. ఆ బలహీన క్షణంలో- 'కామా తురాణాం న భయం న లజ్జ' వంటి స్థితికి లోనవుతాడు మనిషి. మరి ఏకాంత పాపాలు చెడ్డ చావుకి దారి తీస్తాయి అన్నారు మన పెద్దలు.

ఏకాంత సమయంలో మనిషి గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఎవరు చూసినా, చూడకపోయినా, పట్ట పగలయినా, చిమ్మ చీకటయినా అల్లాహ్ మాత్రం చూస్తున్నాడు అని గ్రహించాలి. అధికారి గమనిస్తున్నాడనో, యజమాని చూస్తున్నాడనో కాదు, అల్లాహ్ చూస్తున్నాడన్న భావన మనలో ఉండాలి, మదిలో నిండాలి. అమ్మానాన్నలకు దూరంగా, ఆలుబిడ్డలకు దూరంగా నివసిస్తున్న చాలా మంది అక్రమ సంబంధాల కోసం అర్రులు చాచుతున్నారు. మనం నీతికి నీళ్లు వదలి నీచంగా బ్రతుకుతూ మనవారు మాత్రం నికార్సయిన వారుగా ఉండాలనుకోవటం ఆత్మ వంచన.

## ఒంటరితనంతో సతమతమవుతున్న వారికి ఓ మంచి చిట్కా

కోరి దొరకబుచ్చుకునేది ఏకాంతం. వద్దన్నా వచ్చి హత్తుకునేది ఒంటరితనం. ఒంటరితనంలో వ్యక్తి తప్పనిసరి పరిస్థితుల్లో కానీ, బలవంతంగా వదిలివేయడం వల్ల గాని విడిగా ఉంటారు. కొందరు సమాజానికి భిన్నంగా ఆలోచిస్తూ తోడు లేక ఆలోచన లోనూ, వ్యక్తిగానూ ఒంటరి అవుతారు.

కుటుంబం ఒకరిని ఒంటరిని చేస్తే,సమాజం మరొకరికి ఒంటరి తనం నిర్దేశిస్తుంది. మతం ఒకరి ఏకాంతానికి మూలమయితే, మరొకరి ఏకాంతానికి కారణం మదం. ఏమీ లేవన్న దుఃఖంతో ఒకరు, అన్నీ ఉన్నాయన్న అహంకారంతో మరొకరు ఏకాకి అవుతారు. విషాద దుఃఖంతోనో, ఓటమి దిగుళ్లతోనో, విచారం తోనో భయంతోనో ఒకరు ఏకాకి అయితే, మితిమీరిన స్వార్థం తోనో ఈర్ష్యా అసూయలతోనో, అహంభావంతోనో, ద్వేషంతోనో మరొకరు ఒంటరితనం కొని తెచ్చుకొంటారు. నిరాశానిస్పృహలు ఒకరిని ఏకాకిని చేస్తే, విర్రవీగే విజయగర్వం మరొకరిని ఒంటరిని చేస్తుంది. ఆవేశంలో ఒకరు, ఆగ్రహంలో ఇంకొకరు, ఆశయంలో మరొకరు, ఆదర్శంలో ఒకరు ఒంటరిగా మిగిలి పోతారు.

**ఏకాంత వేడుకోలు :** సకల సమస్యలు, సకల రుగ్మతలకు చక్కటి పరిష్కారం ఈ ఏకాంత పార్థన - దుఆ.

లా ఇలాహ ఇల్లా అంత సుబ్హానక ఇన్నీ కున్తు మినజ్జాలిమీన్ - (అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. నీవు పవిత్రుడవు. నిజానికి నేనే దోషులలో చేరినవాణ్ణి).

అల్లాహ్ ఈ ఏకాంత వేడుకోలు గురించి తెలియజేస్తూ - ఒకవేళ ప్రవక్త యూనుస్ (అ) ఈ దుఆ చదివి ఉండకపోతే ప్రళయం వరకూ చేప కడుపులోనే ఉండిపోయేవారు అని సెలవిస్తున్నాడు. అది చేప కడుపు చీకటి - అంతటి భయంకర స్థితిలో ఆయన్ను కాపాడింది ఈ దుఆ.

**చివరికి అతణ్ని ఒక చేప మింగేసింది.... అప్పుడతను దైవాన్ని స్మరించి ఉండకపోతే పునరుత్థానదినం దాకా ఆ చేప కడుపు లోనే ఉండిపోయేవాడు. చివరికి మేమతణ్ని వ్యాధిగ్రస్త స్థితిలో ఇసుక మైదానంలో విసిరేశాం. అతనికి నీడ కోసం అక్కడ ఒక తీగచెట్టు మొలిపించాం. (అల్-సాఫ్ఫాత్: 142-145)**

## ఒంటరితనాన్ని దూరం చేసిన అద్భుత సంఘటన

దైవప్రవక్త (స) ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ అబూ అబ్దుర్రహ్మాన్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలియజేశారు: "మీ పూర్వీకుల్లోని ముగ్గురు వ్యక్తులు కలసి ప్రయాణానికి బయలు దేరారు. దారిలో రాత్రయింది. ఆ ముగ్గురూ ఒక గుహలో శరణు తీసుకుందామని అందులోకి వెళ్ళారు. అంతలోనే పర్వతం పైనుంచి ఒక పెద్ద బండరాయి దొర్లిపడింది. దాంతో గుహ

ముఖద్వారం మూసుకు పోయింది. (అప్పటి వరకు అనుభవం కానీ భయంకర ఒంటరితనం వారిని తీవ్ర వేదనకు గురి చేసింది) దాంతో వారు ఆ ఆపద నుంచి బయటపడే మార్గం గురించి మాట్లాడుకున్నారు. ఆఖరికి తాము అంతకు మునుపు చేసుకున్న సత్కార్యాల ఆధారంగా అల్లాహ్‌ను వేడుకోవడం తప్ప ఆ విపత్తు నుండి బయట పడేందుకు వేరేమార్గం లేదన్న నిర్ణయానికి వచ్చారు. వారిలోని ఒకడు ఇలా వేడుకున్నాడు :

"ఓ అల్లాహ్! నాకు మరీ ముసలివారైన తల్లిదండ్రులుండేవారు. సాయంత్రం పూట అందరికంటే ముందు వారికి పాలు త్రాగించే వాడిని. వారికంటే ముందు నా భార్యాబిడ్డలకు గానీ, నా నౌకర్లకు గాని త్రాపించేవాణ్ణి కాను. ఒకరోజు నేను (పశువులకు) చెట్లమేత కోసం చాలా దూరం వెళ్ళిపోయాను. నేను ఇంటికి తిరిగి వచ్చేసరికి నా తల్లిదండ్రులిద్దరూ నిద్రపోయారు. నేను ఆ పూట పాలు పితికి తీసుకువచ్చాను. అప్పటికే వారు గాఢ నిద్రలో ఉండడం గమనించాను. వారిని మేల్కొలపడానికి నాకు మనసొప్పలేదు. వారికంటే ముందు నా భార్యాబిడ్డలకు, నౌకర్లకు పాలు త్రాగించడం కూడా నాకిష్టం లేదు. అందుకని నా పిల్లలు నా కాళ్ళ మీద పడి విలవిల్లాడినా కూడా (నేను వారికి త్రాపకుండా) పాలపాత్ర చేతిలో పట్టుకొని తెల్లవారే దాకా వాళ్ళ దగ్గరే నిలబడి, ఏ సమయంలోనైనా వారు మేల్కొంటారేమోనని ఎదురు చూడసాగాను. తెల్లవారిన తరువాత గాని వారు లేవలేదు. నిద్ర మేల్కొని రాత్రి వారికోసం ఉంచబడిన పాలు తాగారు. ఓ అల్లాహ్! కేవలం నీ ప్రసన్నత కోసమే నేనీ పని చేసివుంటే మేము చిక్కుకున్న ఈ గుహ ముఖ ద్వారం నుండి బండరాయిని తొలగించి మమ్మల్ని రక్షించు." అతని వేడుకోలు ఫలితంగా ఆ బండ రాయి కొద్దిగా జరిగింది. అయితే (అప్పటికీ) ఆ సందుగుండా వారు బయటికి రాలేకపోయారు.

తరువాత రెండో వ్యక్తి అభ్యర్థించుకో సాగాడు: "ఓ అల్లాహ్! నా బాబాయి కూతురు ఒకామె ఉండేది. నేనామెను అమితంగా ఇష్టపడేవాణ్ణి. (వేరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది): మగవారు ఆడ వారిని అమితంగా ప్రేమించినంతగా నేను ఆమెను ప్రేమించే వాడిని. ఒకసారి నేను ఆమె పొందుకోసం పరితపించాను. కాని అందుకామె ఒప్పుకోలేదు. ఆఖరికి దుర్భిక్షం ఆమెను గత్యంతరం లేక నా వద్దకు వచ్చేలా చేసింది. అప్పుడు ఆమె నాతో ఏకాంతంలో గడిపే షరతుపై నేనామెకు నూట ఇరవై దీనార్లు ఇచ్చాను (గత్యంతరం లేక ఆమె అవి తీసుకుంది). నా కోరిక తీర్చేందుకు సిద్ధమయ్యింది. నేనామెను ఆక్రమించుకున్నప్పుడు, (వేరొక ఉల్లేఖనం ప్రకారం) నేను ఆమె రెండు తొడల మధ్య కూర్చున్నప్పుడు ఆమె నాతో 'అల్లాహ్‌కు భయపడు! అక్రమంగా నా కన్నె పొరను చీల్చకు' అని అంది. ఆ మాటలు విన్న తడవుగా నేను ఆమె దగ్గర్నుండి లేచిపోయాను. నిజానికి ఆమె నాకు ప్రజల్లో అత్యంత ప్రియతమమైనది. నేను ఆమెకిచ్చిన బంగారు దీనార్లను కూడా వదులుకున్నాను. ఓ దేవా! నేను కేవలం నీ ప్రసన్నత కోసమే ఇలా చేసి ఉన్నట్లయితే మాపై వచ్చిపడిన ఈ విపత్తు నుండి మమ్మల్ని రక్షించు." రెండో వ్యక్తి వేడుకోలు తరువాత ఆ బండరాయి ఇంకొంచెం తొలగింది. అయినా గాని వారు బయటపడేందుకు మార్గం సుగమం కాలేదు.

ఆ తరువాత మూడో వ్యక్తి వేడుకోవడం ప్రారంభించాడు: "ప్రభూ! నేను కొంత మంది పని మనుషులను జీతానికుంచుకున్నాను. నేను వారందరికీ జీతాలిచ్చేశాను. కాని వారిలో ఒకడు మాత్రం తన జీతం పుచ్చుకోకుండానే వెళ్ళిపోయాడు. నేను అతని జీతాన్ని వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాను. దాంతో చాలా ధనం పోగయ్యింది. కొంత కాలానికి ఆ వ్యక్తి వచ్చి, 'ఓ దైవ దాసుడా! నాకు నా జీతం ఇవ్వు' అనడిగాడు. దానికి నేను, 'నువ్వు చూస్తున్నటువంటి ఈ ఒంటెలు, ఆవులు, మేకలు, బానిసలు - అన్నీ నీ జీతం ఫలాలే (వాటిని నువ్వు తీసేసుకో)' అన్నాను. అందుకతను 'ఓ దైవదాసుడా! నాతో పరాచికాలు వద్దు' అంటూ చిన్నబోయాడు. నేను 'ఇది పరాచికం కాదు (నిజం చెబుతున్నాను)' అన్నాను. అప్పుడు అతను (నా కోసం) ఏమీ వదలకుండా ఆ సంపదనంతా తరలించుకొని వెళ్ళిపోయాడు. ఓ అల్లాహ్! నేను ఈ పని కేవలం నీ ప్రసన్నతను దృష్టిలో పెట్టుకొనే చేసినట్లయితే మేము చిక్కుకున్నటువంటి ఈ ఆపద నుంచి మమ్మల్ని కాపాడు." దాంతో ఆ బండరాయి పూర్తిగా తొలగిపోయి గుహద్వారం తెరుచుకోవటంతో వారు ముగ్గురూ బయటపడ్డారు. (బుఖారీ- ముస్లిం)

## చివరి మాట

ఎంతటి ఏకాంతాన్నైనా సుందర స్వప్నంలా, అందమైన అనుభవంలా మార్చుకోగల సృజనశీలి మనిషి. ఎంతయినా, మనిషికి మనిషి తోడు. మాటకి మాట సాయం. మనిషి సాటిమనిషినే కాదు, సమస్త జీవరాశితో ముడిపడిన ప్రకృతిని తోడుగా తీసుకొని.. బతక నేర్చినవాడు! తన లోకం తాను నిర్మించుకోగల నేర్పరి. మరి, ఇప్పటికే ఎవరిగదుల్లో వాళ్ళు ఏకాంతంగా కూరుకుపోతున్నామని అనుకొంటున్నారా? ఎవరి చేతుల్లోని సెల్‌ఫోనుల్లో, తెరల్లోకి కూరుకుపోయిన మనం, ఏకాంతంగా ఉన్నట్టా లేనట్టా? గదిగోడలు కాదు కానీ, మదిగోడలు ఎంత మందంగా ఉన్నాయో గమనించండి. వాస్తవానికి, మనుషులనీ మాటలని అవి ఆపగలవా? నిజంగానే ఆపేస్తున్నాయా? ❖

**మస్జిద్**లో సామూహిక నమాజ్‌కు సారథ్యం వహించే వారిని పేష్ ఇమామ్ అంటారు. ఇమామ్ అంటే నాయకుడు అని అర్థం. ఆ మస్జిద్‌కు వచ్చేవారు ఈ ఇమామ్‌ను ఎన్నుకుంటారు. ఇమామ్‌లు కేవలం నమాజ్‌కు సారథ్యం వహించటం మాత్రమే కాదు, తమ వెనుక నిలబడ్డ సమాజానికి అన్ని విషయాల్లోనూ సరియైన దిక్కు చూపించవలసిన వారు. వీరికి ఆధ్యాత్మిక విషయాలతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, జాతీయ, అంతర్జాతీయ విషయాలపై ఇస్లాంవెలుగులో విశ్లేషించే విస్తృత పరిజ్ఞానం ఉండాలి. ఈ జ్ఞానాన్ని మొత్తం సమాజానికి పంచాలి. సామాజిక స్పృహను, సామరస్యాన్ని, శాంతిని పెంపొందించాలి. దురదృష్టవశాత్తు చాలా మంది ఇమాముల్లో ఆధ్యాత్మిక జ్ఞానం తప్ప ఇతర రంగాల జ్ఞానం ఉండటం లేదు. పరలోక విషయాలు తప్ప ప్రాపంచిక విషయాల పట్ల నిర్లిప్తత ఉంటుంది. దునియాకే బాతా మత్ కరో సబ్ అల్లాహ్ దేఖ్ లేతె (ప్రాపంచిక విషయాలు మాట్లాడకండి. అంతా దైవమే చూసుకుంటాడు) అని చెప్పి ముస్లిం సమాజంలో సామాజిక చైతన్యాన్ని నిర్వీర్యం చేశారు. ఇది ఇస్లాం బోధించే సామాజిక చైతన్య స్ఫూర్తికే విరుద్ధం. (అందరు పేష్ ఇమాములు ఇలా లేరు) ఎక్కువ మంది ఇలా ఉన్నారు. ఇది సంస్కరించుకోవాల్సిన ప్రధానాంశం. ఇమాములు, ముల్లాలు, మౌల్వీలు మస్జిదు నాలుగు గోడలకే పరిమితం అవుతున్నారు. వీరు ప్రజల మధ్యకు రావాలి. ఇంటింటికీ తిరిగి నమాజ్‌కు పిలవటం మంచి విషయమే కాని సామాజిక విషయాల పట్ల కూడా చైతన్యం కలిగించాలి.

నిజానికి పేష్ ఇమామ్ అంటే పూజారి కాదు. ఇస్లాంలో పూజారి వ్యవస్థకు తావే లేదు. ఇస్లాంలో దైవానికి– మనిషికి మధ్య మధ్యవర్తు లెవరూ ఉండరు. నమాజ్ సమయానికి ఇమాం రాలేకపోతే వేళకు వచ్చిన వారిలో ఎవరైనా నమాజ్ చేయించవచ్చు. ఎవరైనా ఖుత్బా (ప్రసంగం) చెప్పవచ్చు. నమాజ్ వేళకు ముందుగా రాలేకపోతే ఇమామ్ ఐనా సరే వెనుక వరుసలో నిలబడి అందరితోపాటు నమాజ్ చదవాల్సిందే. ప్రముఖ కవయిత్రి సరోజిని నాయుడు ఓ సందర్భంలో "మస్జిదులో రాజు, పేద, రైతు, కార్మికుడు, నల్లవాడు, తెల్లవాడు అనే తేడా లేకుండా అందరూ పక్కపక్కనే నిలబడి అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు) అంటారు. రోజుకు ఐదు పూటలా సామాజిక సమానత్వంతో కూడిన ప్రజాస్వామ్యం మస్జిదుల్లో మూర్తీభవించటం నేను చూశాను" అని అన్నారు.

ఎంతో చైతన్యవంతమైన పేష్ ఇమామ్ అనే ఈ 'పాత్ర' ఇప్పుడు నమాజ్ చేయించడం వరకే పరిమితం అయ్యింది. మస్జిదుకు వచ్చే వారు ఇచ్చే చందాలతో లభించే అరకొర జీతంతో కనీసావసరాలు కూడా తీరక అల్లాహ్‌పై భారం వేసి బతుకు బండిని లాగుతుంది. ఇప్పుడైతే ప్రభుత్వాలు ఇచ్చే అతి తక్కువ జీతాలతో గడుపుతూ పాలకులు చేసే తప్పుల్ని ఎత్తి చూపే సాహసం చేయలేక బిక్కుబిక్కు మంటుంది. ఒకప్పుడు ముస్లిం సమాజ సమస్యలకు పరిష్కారాలను చూపి దిశానిర్దేశనం చేసే విధంగా పేష్ ఇమాంలు ఉండేవారు. ఇప్పుడైతే మస్జిద్ కమిటీల్లో ఉండే రాజకీయాల ముందు అణిగి




మణిగి ఉండాల్సిందే. ఇలాంటి దుస్థితి నుండి పేష్ ఇమామ్‌లు బయటపడాలని కోరుకుందాం. పేష్ ఇమాం అంటే అల్లాహ్ ముందు తప్ప మరెవ్వరికీ తలవంచని ధీరుడవ్వాలి.. న్యాయాన్ని న్యాయంగా, అన్యాయాన్ని అన్యాయంగా చెప్పగలిగే తెగువుండాలి. ఒకప్పటి ఇమామ్‌లు అలా ఉండేవారు. బ్రిటిష్ వాడు దేశాన్ని దురాక్రమించి నపుడు ఈ ఇమామ్‌లు, మౌల్వీలు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. తమ గళమెత్తారు. కనుకే బ్రిటిష్ ప్రభుత్వం ఒక్క ఢిల్లీలోనే మూడు వేల మంది ఇమామ్‌లను, మౌల్వీలను చెట్లకు వేలాడదీసి ఉరితీసింది. ఇమామ్‌లు, మౌల్వీలు స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మహత్తరమైన పాత్రను నిర్వహించిన వారు. ఇప్పుడు అటువంటి పోరాటాలేమీ చేయనక్కర్లేదు, కానీ సామాజిక సంస్కరణలకు, చైతన్యానికి నడుం కట్టాలి. వివిధ కారణాల వల్ల సమాజంలో పెరుగుతున్న మత విద్వేషాలను నిర్మూలించే క్రమంలో శాంతి, సామరస్యాల సందేశం ఇచ్చే దూతలవ్వాలి. క్రమేణా పేష్ ఇమామ్‌ల, మౌల్వీల విశ్వాస ప్రాభవం నమాజ్, రోజా వంటి ఆధ్యాత్మిక ఆచరణలకే పరిమితం అయ్యింది. ఇది విచారకరమైన అంశం.

ఇమామత్ అనేది వృత్తి కాదు. ధార్మిక నాయకత్వం.దీనిని విస్మరించి క్రమేణా వృత్తిలా మార్చారు. పేష్ ఇమామ్ సమాజంలోని శ్రమ, ఉత్పత్తి రంగాలకు సంబంధించి ఏదో ఒక పని చేసుకుంటూ, తన కుటుంబాన్ని పోషించుకుంటూ మస్జిదులో ఇమామ్ బాధ్యతలు నిర్వహించాలి. సహాబా కాలంలో ఇలాగే జరిగేది. ఈ ఆధునిక కాలంలో ఆర్థిక స్థితిగతులు సరిగా లేనందున ఆయా మస్జిదులకు వచ్చే నమాజీలే తలా కొంత సేకరించి జీతంగా ఇస్తున్నారు. ఇది తప్పేమీ కాదు. కానీ దీనివల్ల పేష్ ఇమామ్‌లలో ఆత్మన్యూనత తలెత్తుతుంది. ఇలా కాకుండా ముస్లిం సమాజం మస్జిదు నిర్వహణ నిమిత్తం షాపులు లేదా ఇళ్ళు కట్టించి ఆ అద్దెలతో జీతమివ్వడం మెరుగైన పద్ధతి. పేష్ ఇమామ్‌లు ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎవ్వరినీ దేబిరించరు. అవినీతికి పాల్పడరు. దైవభక్తి, దైవభీతి ఉంటాయి. ఇది చాలా గొప్ప విషయం. ఇటువంటి ధర్మవర్తన కలిగిన వారిని నాయకులుగా చూడాలి. నాయకులుగా చేసుకోవాలి. మున్ముందు పేష్ ఇమామ్‌లు మరింత చైతన్యవంతమై, ప్రాపంచిక విద్యలోనూ రాటుదేలి, ముస్లిం సమాజ చైతన్య సారథులుగా నిలుస్తారని ఆశిద్దాం.



- డా. ఎన్.ఖలీల్

# మలేరియా లక్షణాలేంటి? నివారణ ఎలా?

**చార్లెస్ అల్ఫోన్సో లావెరన్** 1880లో మనుషుల్లో మలేరియా వ్యాధికారక క్రిమిని కనుగొన్నారు. దీనిని "ప్లాస్మోడియం" జాతికి చెందిన పరాన్నజీవిగా గుర్తించారు. ఈ పరాన్నజీవులతో మలేరియా సోకే అవకాశం ఉంది. ఈ క్రిమి మనుషుల్లో ఒకరి నుండి మరొకరికి దోమల ద్వారా వ్యాపిస్తుందని నిర్ధారించడం జరిగింది. ఈ వ్యాధిని అధికంగా అనుభవించిన ఆఫ్రికా ఖండం 2001లో "ఆఫ్రికా మలేరియా డే" జరిపింది. ప్రపంచ దేశాలు ఏప్రిల్ 25 ను "వరల్డ్ మలేరియా డే"గా జరుపుతున్నాయి.

2025 ప్రపంచ మలేరియా దినోత్సవం థీమ్ Malaria Ends With Us: Reinvest, Reimagine, Reignite. ఈ థీమ్ మలేరియాను నిర్మూలించడానికి నిబద్ధత, పెట్టుబడులు వినూత్న వ్యూహాల అవసరాన్ని నొక్కి చెబుతుంది.

## ప్రపంచ మలేరియా దినోత్సవం అంటే ఏమిటి?

మలేరియా ప్రాణాంతక ప్రభావాల గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడానికి, వ్యాధిని నిర్మూలించే ప్రయత్నాలను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది సోకిన అనాఫిలిస్ దోమల కాటు ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. మలేరియా అనేక ప్రాంతాలలో, ముఖ్యంగా సబ్-సహారా ఆఫ్రికాలో అత్యంత తీవ్రమైన ముప్పులలో ఒకటిగా కొనసాగుతోంది.

ఇప్పుడు కొత్త రోగనిర్ధారణ సాధనాలు, పద్ధతులు వెలువడుతున్నాయి, ముఖ్యంగా మారుమూల ప్రాంతాలలో మలేరియా వ్యతిరేక పోరాటంలో నిబద్ధత, వినూత్న వ్యూహాలు, నిరంతర పెట్టుబడి అవసరమవుతోంది.

## మలేరియా లక్షణాలు

దోమ కుట్టిన 10-15 రోజుల తర్వాత లక్షణాలు అభివృద్ధి చెందుతాయి. చికిత్స చేయకుండా వదిలేస్తే, మలేరియా అవయవ వైఫల్యం, కోమా లేదా మరణం వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది, కాబట్టి మలేరియా ప్రాణాంతకమైనది. వైద్యసహాయం వెంటనే అవసరం.

**జ్వరం :** అకస్మాత్తుగా వచ్చే అధిక జ్వరం అత్యంత సాధారణ లక్షణాలలో ఒకటి.

**చలి :** చాలా మందికి చలి వస్తుంది, ఇది తీవ్రంగా ఉండవచ్చు, తరువాత చెమట పడుతుంది.

**చెమట పడుతుంది :** చలి తర్వాత, జ్వరం తగ్గి విపరీతంగా చెమట పట్టవచ్చు.

**తలనొప్పి** : మలేరియా కేసులలో తరచుగా తలనొప్పి సాధారణం.

**అలసట** : చాలా అలసటగా లేదా బలహీనంగా అనిపించడం మలేరియా ఉన్న చాలా మంది వ్యక్తులకు వికారం, వాంతులు కూడా ఉంటాయి.

**కండరాలు, కీళ్ల నొప్పి** : కండరాలు, కీళ్లలో నొప్పులు సాధారణం.

**రక్తహీనత** : పరాన్నజీవి ఎర్ర రక్త కణాలను నాశనం చేస్తుంది, ఇది రక్తహీనతకు దారి తీస్తుంది.

**దగ్గు** : కొంతమందికి తేలికపాటి దగ్గు వస్తుంది.

**కడుపు నొప్పి** : కొంతమందికి కడుపులో అసౌకర్యం లేదా నొప్పి ఉంటుంది.

మలేరియాపై పోరాటంలో కీలకమైన సాధనం మలేరియా టీకా. RTS, SAS 01 వ్యాక్సిన్ విస్తృత ఉపయోగం కోసం ఆమోదించబడిన మొదటి మలేరియా వ్యాక్సిన్. ఈ వ్యాక్సిన్ అత్యంత ప్రాణాంతకమైన మలేరియా జాతి అయిన ప్లాస్మోడియం ఫాల్సిపరం పరాన్నజీవి నుండి రక్షించడానికి రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించడం ద్వారా పనిచేస్తుంది. ఈ వ్యాక్సిన్ ముఖ్యంగా పిల్లలకు అదనపు రక్షణ పొరను అందిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాక్సిన్ విస్తృత వినియోగాన్ని సిఫార్సు చేసింది. మలేరియా నియంత్రణ, నిర్మూలన కోసం విస్తృత వ్యూహంలో ఈ వ్యాక్సిన్ ఒక కీలకమైన సాధనంగా పరిగణించబడుతుంది,

### మలేరియా గురించిన అపోహలు

**అపోహ** : మలేరియా గ్రామీణ ప్రాంతాల్లోనే సంభవిస్తుంది.

**వాస్తవం** : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోనూ మలేరియా సంభవిస్తుంది. నిలిచి ఉన్న నీటి కారణంగా గ్రామీణ ప్రాంతాలు దోమల వృద్ధికి ఎక్కువగా గురవుతుండగా, ముఖ్యంగా పారిశుధ్యం నీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో పట్టణ ప్రాంతాలు కూడా ప్రమాదంలో ఉన్నాయి. నగరాల్లో కూడా మలేరియా వ్యాప్తి చెందుతుంది.

**అపోహ** : రాత్రిపూట కుట్టే దోమ నుండి మాత్రమే మలేరియా వస్తుంది.

మలేరియాను వ్యాప్తి చేసే అనోఫిలిస్ దోమలు ప్రధానంగా సంధ్యా సమయంలో తెల్లవారుజామున చురుకుగా ఉంటాయి, కొన్ని జాతులు రోజంతా కూడా కుట్టవచ్చు. అన్ని సమయాల్లో దోమ కాటు నుండి రక్షించుకోవడం ముఖ్యం,

**అపోహ** : మలేరియా వ్యక్తి నుండి వ్యక్తికి వ్యాపిస్తుంది.

ఇది ప్రధానంగా అనోఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది.

**అపోహ** : ఒకసారి మలేరియా బారిన పడిన తర్వాత జీవితాంతం రోగనిరోధక శక్తి లభిస్తుంది.

**వాస్తవం** : ఒకసారి మలేరియా బారిన పడటం వల్ల జీవితాంతం రోగనిరోధక శక్తి లభించదు. పదే పదే వ్యాధి బారిన పడటం వలన కాలక్రమేణా పాక్షిక రోగనిరోధక శక్తి ఏర్పడవచ్చు, కానీ అది పూర్తి రక్షణకు హామీ ఇవ్వదు. గతంలో మలేరియా బారిన పడిన వ్యక్తులు కూడా పరాన్న జీవికి గురైతే మళ్ళీ వ్యాధి బారిన పడే అవకాశం ఉంది. అందువల్ల దోమకాటు నుంచి రక్షణ పొందడం చాలా అవసరం. దోమతెరలు వాడడం, నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి కాబట్టి, బకెట్లు, పూల కుండలు, వర్షపు నీరు నిల్వ ఉన్న పాత టైర్లు వంటి ఖాళీ కంటైనర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

గ్రామీణ ప్రాంతాలలో మాత్రమే మలేరియా కనిపిస్తుందని అనుకోకండి. పట్టణ ప్రాంతాలలో కూడా దోమల ద్వారా సంక్రమించే మలేరియా ఉండవచ్చు, ముఖ్యంగా పారిశుద్యం తక్కువగా ఉన్న, నీరు నిలిచి ఉన్న ప్రాంతాలలో మలేరియా వ్యాపించవచ్చు. నీటి పాత్రలను బయట ఉంచవద్దు, నిల్వనీరు ఉండకుండా చూడండి

మలేరియాను నిర్మూలించడానికి ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలను సమీక్షించుకోవడానికి ప్రతి సంవత్సరం ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుతున్నారు. అయితే మలేరియా వ్యతిరేక పోరాటానికి సమిష్టి ప్రయత్నం అవసరం.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## హజ్ పోర్టల్ పునఃప్రారంభం.. 10 వేల మంది భారత యాత్రికులకు అవకాశం

హజ్ పోర్టల్‌ను పునఃప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా దాదాపు 10 వేల మంది భారతీయులకు అవకాశం కల్పించనున్నారు. కంబైన్డ్ హజ్ గ్రూప్ ఆపరేటర్స్ (CHGO) కోసం హజ్ పోర్టల్‌ను తెరిచినట్లు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. CHGO ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే తన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించింది. పలుమార్లు హెచ్చరించినా ఇటీవల భారత్‌లోని సీహెచ్‌జీవో వారు మినా క్యాంప్‌లు, బస, ప్రయాణ ఏర్పాట్లకు అవసరమైన కాంట్రాక్టులను పూర్తి చేయడంలో విఫలమయ్యారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సౌదీ హజ్ మంత్రిత్వ శాఖతో చర్చలు జరిపింది. దాంతో ఆ శాఖ 10 వేల మందికి అవకాశం కల్పించేలా హజ్ పోర్టల్‌ను తిరిగి తెరిచేందుకు అంగీకరించింది. అంతకు ముందు మినాలో ప్రైవేటు ఆపరేటర్లకు కేటాయించిన జోన్లను రద్దు చేస్తూ సౌదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. దాంతో దాదాపు 52 వేల మంది భారతీయ యాత్రికుల పరిస్థితి గందరగోళంలో పడింది. కాగా ఏటా భారత్‌కు కేటాయించిన కోటాలో 70 శాతం మందిని హజ్ కమిటీ ద్వారా, మిగిలిన 30 శాతం మందిని హజ్ గ్రూప్ ఆర్గనైజర్స్ ద్వారా పంపిస్తారు. 2025కుగాను భారత్‌కు 1.75 లక్షల కోటాను సౌదీ కేటాయించింది. ఈ క్రమంలో గత వారం కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి చంద్రశేఖర్ కుమార్.. జెద్దాను సందర్శించి హజ్‌యాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఏడాది జూన్ 4, 9 తేదీల్లో హజ్‌ను నిర్వహించవచ్చని చెబుతున్నారు.

## ప్రతి ఐదుగురిలో ఒకరికి విటమిన్-డీ లోపం..!

మన శరీరాలపై సూర్యరశ్మి కావాల్సినంత పడకపోతే విటమిన్-డీ లోపం తలెత్తుతుంది. అందుకే ఇంటి గదులకు వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకుంటారు. అయితే భారతదేశంలో సూర్యరశ్మికి కొదువలేదు. దేశం నలుమూలలా సూర్యకాంతి ప్రసరిస్తుంది. అయినప్పటికీ తెలంగాణతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విటమిన్-డీ లోపం తీవ్రంగా ఉన్నది. దేశంలోని పలు సంస్థలు తాజాగా వెల్లడించిన నివేదికల్లో ఈ విషయం స్పష్టమైంది. దేశంలోని ప్రతి ఐదుగురిలో ఒకరు విటమిన్-డీ లోపంతో బాధపడుతున్నారని నివేదికలు తెలుపుతున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం దేశంలో ప్రస్తుతం 49 కోట్ల మంది విటమిన్-డీ లోపంతో బాధపడుతున్నారు. ఆ 49 కోట్ల మందిలో 30 శాతం పిల్లలు, యుక్త వయస్కులే ఉన్నారు. ఇక పట్టణ మహిళల్లో ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంది. పట్టణాల్లో 80 శాతం మంది మహిళలు విటమిన్-డి లోపంతో ఇబ్బంది పడుతున్నారు. విటమిన్-డీ స్థాయిలు 30 ng/ml కంటే తక్కువగా ఉంటే దాన్ని విటమిన్-డి లోపంగా చెప్పవచ్చు. ప్రతిరోజు మనిషి శరీరంలోని 40 శాతంపై 20 నిమిషాలపాటు సూర్యరశ్మి పడితే కావాల్సినంత విటమిన్-డీ లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

## 10 లక్షల మందికి 15 మంది జడ్జిలే

దేశంలో ప్రతి 10 లక్షల మంది జనాభాకు కేవలం 15 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి 50 మంది న్యాయ మూర్తులు ఉండాలని 1987లో లా కమిషన్ చేసిన సిఫార్సులకు ఇది ఆమడ దూరంలో ఉన్నది. ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దేశంలో మొత్తం 21,285 న్యాయ మూర్తులున్నారని, లా కమిషన్ సిఫార్సుల ప్రకారం 50 మంది జడ్జీలుండాలని నివేదిక వెల్లడించింది.

## ఢిల్లీలో 3 రోజులుంటే.. రోగాలు ఖాయం

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉందంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ నగరంలో కేవలం 3 రోజులున్నా.. ఆ వ్యక్తికి రోగాలు (ఇన్‌ఫెక్షన్లు) సోకటం ఖాయమని అన్నారు. ఇటీవలె ముంబైలోని ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఢిల్లీ వాయు కాలుష్యం బారిన పడ్డవాళ్ల ఆయుష్షు 10 ఏండ్లు తగ్గుతుందని అన్నారు. వాయు కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబై నగరాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని చెప్పారు. నగరాల్లో పర్యావరణ సమస్యల్ని అత్యవసరంగా పరిష్కరించాల్సి ఉందన్నారు. 'పర్యావరణ సమస్యల్ని మనం అంత సీరియస్‌గా తీసుకోవటం లేదు. ఆర్థిక, మౌలిక వసతులు సమకూర్చడానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో, ఎకాలజీ (జీవావరణం), ఎథిక్స్‌కు (న్యాయమైన వ్యాపారం) కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యం' అని చెప్పారు.

## లా కమిషన్ చైర్‌పర్సన్‌గా దినేశ్ మహేశ్వరి

సుప్రీంకోర్టు జడ్జి దినేశ్ మహేశ్వరి 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఆయనతో పాటు కమిషన్ సభ్యులుగా డీపీ వర్మ, హితేశ్ జైన్‌లను నియమిస్తూ ప్రధాని మోదీ ఉత్తర్వులు జారీ చేశారని, దీంతో వారు బాధ్యతలు చేపట్టారని న్యాయ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2019లో సుప్రీం కోర్టు జడ్జిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మహేశ్వరి 2023 మేలో సుప్రీం కోర్టు జడ్జీగా పదవీ విరమణ చేశారు. ఆయన 2016లో మేఘాలయ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, 2018లో కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా వ్యవహరించారు.

సర్వత్రా

## ట్రంప్ సర్కారుపై న్యాయపోరు

విద్యా సంవత్సరం మధ్యలో తమను దేశం నుంచి వెళ్లగొడుతూ ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆకస్మిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ అమెరికా వ్యాప్తంగా పలు ఫెడరల్ కోర్టులలో పలువురు విదేశీ విద్యార్థులు కేసులు దాఖలు చేశారు. తమను అన్యాయంగా టార్గెట్ చేసి దేశం నుంచి వెళ్లగొడుతున్నారని, ఎలాంటి న్యాయపరమైన ప్రక్రియ పాటించకుండా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం ల్యాండ్ సెక్యూరిటీ తమ వీసాలను రద్దు చేసిందని, దీని కారణంగా వందలాది మంది విద్యార్థులు దేశ బహిష్కరణ శిక్షను ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. హార్వర్డ్ వర్సిటీకి నిధుల స్తంభన, క్యాంపస్‌లో విద్యార్థుల కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలన్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ డిమాండ్లను తిరస్కరించి నందుకు హార్వర్డ్ యూనివర్సిటీకి 220 కోట్ల డాలర్ల (రూ. 18,864 కోట్లు) గ్రాంట్లు, కాంట్రాక్టులను స్తంభింప చేస్తున్నట్టు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది.

## బీపీ కంట్రోల్‌లో ఉండాలంటే ఈ పండు రోజుకొక్కటి తింటే చాలు!



అధిక రక్తపోటు అదుపులో ఉండాలంటే రోజుకో అరటి పండు తినాలని వాటర్‌లూ యూనివర్సిటీ కొత్త అధ్యయనం సూచిస్తోంది. రోజూ తినే ఆహారంలో పొటాషియం ఎక్కువగా, సోడియం తక్కువగా ఉండేలా చూసుకొంటే రక్తపోటు తగ్గుతుందని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన మెలిస్సా స్టాట్ అన్నారు. పొటాషియం ఎక్కువగా ఉండే అరటి, బ్రకోలి లాంటి ఆహారాన్ని తినడం వల్ల రక్తపోటుపై సానుకూల ప్రభావం పడుతుందని వారు చెప్పారు..

## జపాన్‌లో పని దినాలు వారానికి 4 రోజులే

వారంలో 70 నుంచి 90 గంటలు పని చేయాలని మన దేశంలోని ప్రముఖులు సూచిస్తున్న తరుణంలో, జపాన్ వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయడం ప్రారంభించింది. ఉద్యోగులు తమ కుటుంబ బాధ్యతలను నెరవేర్చడంలో సాయపడటమే లక్ష్యంగా టోక్యో మెట్రోపాలిటన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టోక్యో గవర్నర్ యురికో కొయికే మెట్రో పాలిటన్ అసెంబ్లీలో మాట్లాడుతూ, కుటుంబం-కెరీర్ మధ్య ఏదో ఒకదానిని ఎంచుకునే పరిస్థితిని మహిళలకు కల్పించ కూడదనేదే తమ లక్ష్యమని చెప్పారు. జీవితంలో పిల్లల్ని కనడం వంటి ఘట్టాలు వృత్తిపరమైన అభివృద్ధికి ఆటంకంగా నిలవని సమాజాన్ని నిర్మించాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ పరిశోధన ప్రకారం పని దినాల సంఖ్య తగ్గడం వల్ల పిల్లల సంరక్షణలో పురుషులు మరింత భాగస్వాముల య్యేందుకు దోహదపడుతుంది.

## పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తాం : మాక్రాన్

పాలస్తీనా దేశాన్ని జూన్‌లో గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చెప్పారు. ఇందుకు ప్రతిగా మధ్య ప్రాచ్యంలోని మరికొన్ని దేశాలు ఇజ్రాయిల్‌ను గుర్తించగలవని అన్నారు. పాలస్తీనాను సార్వభౌమాధికార దేశంగా దాదాపు 150 దేశాలు గుర్తించినా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి ప్రధాన పశ్చిమ దేశాలు ఇప్పటివరకు గుర్తించలేదు. "పాలస్తీనా దేశాన్ని గుర్తించే దిశగా మేం ముందుకు సాగాల్సిన అవసరం వుంది. బహుశా కొద్ది నెలల్లో అది జరగవచ్చు, ఎవరినో బుజ్జగించడానికి నేను ఇది చేయడం లేదు. ఒక దశలో ఇది సరైందని భావిస్తున్నందున ఈ చర్య తీసుకుంటున్నాం" అని ఫ్రాన్స్ 5 టెలివిజన్‌తో ఇంటర్వ్యూ సందర్భంగా మాక్రాన్ వ్యాఖ్యానించారు

## మహిళలు, పిల్లలను చంపుతున్న ఇజ్రాయిల్

ఇజ్రాయిల్ గాజాలో మహిళలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని చంపుతోందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. మార్చి 18 నుండి ఏప్రిల్ 9 వరకు ఇజ్రాయిల్ 36 వైమానిక దాడులు చేసింది. వాటిలో మహిళలు, పిల్లలు మాత్రమే మరణించారు. మార్చి 18 నుండి ఏప్రిల్ 9 వరకు ఇజ్రాయిల్ గాజాలో 224 దాడులు నిర్వహించింది. గాజాలో ఏ ప్రదేశమూ సురక్షితంగా లేదని యుఎన్ మానవ హక్కుల హైకమిషనర్ రవీనా శందాసాని అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఖాన్ యూనిస్‌లో జరిగిన వైమానిక దాడిలో ఏడుగురు పిల్లలు సహా ఒక కుటుంబానికి చెందిన పది మంది మరణించారు. ఇతర ప్రదేశాలలో మరో ఐదుగురు మరణించారు. గాజాను భూమిపై నరకంగా రెడ్ క్రాస్ అభివర్ణించింది.





**మనుషులు చేయదగ్గ అత్యుత్తమ ధార్మిక కార్యక్రమం, బాధ్యత... దానం.** అందుకే ఇస్లాం ఇలాంటి మంచి పనుల్ని ప్రోత్సహించింది. మనిషిలోని వ్యక్తిగత భావోద్వేగాలను, లోభత్వాన్ని తగ్గించి అతడిని ఉదారుడిగా మార్చింది. దైవ మార్గంలో ఖర్చు పెట్టేందుకు తమ ఆస్తులను దానం చేసే వారు ఎంతో ధన్యులని తెలిపింది. పుణ్యాత్ముల చేత విరివిగా దైవ మార్గంలో దానాలు చేయించింది. ఇలా దైవ మార్గంలో దానం చేసిన ఆస్తులనే వక్ఫ్ ఆస్తులుగా పేర్కొంది. 'వక్ఫ్' ఆస్తులుగా పిలిచే వాటిని దానాల రూపంలో స్వీకరించి పేదల సేవకు ఖర్చు చేయిస్తున్నది. 'ప్రజలంతా దేవుడి కుటుంబమే. ఎవరైతే ఆయన కుటుంబానికి ప్రయోజనం చేకూరుస్తారో.. వారే దేవుడికి ప్రీతిపాత్రులు' అని మహా ప్రవక్త (సఅసం) స్పష్టంగా ప్రవచించారు. 'మీరు అమితంగా ప్రేమించే వస్తువుల్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు' అని ఖుర్ఆన్‌లో అల్లాహ్ పేర్కొంటున్నాడు. ఈ అయత్ అవతరించాక అబూ తల్హా అన్సారీ (రజి) ఇలా అన్నారు... 'హుజూర్..నాకున్న ఆస్తిలో మధురమైన నీటిని అందించే బైరహ్ బావి గల తోట నాకు అత్యంత ప్రియమైనది. దాన్ని నేను అల్లాహ్ మార్గంలో దానం చేస్తున్నాను. దాన్ని మీ ఇష్టం వచ్చిన రీతిలో ఉపయోగించుకోండి' అని. దానికి మహాప్రవక్త(స) సమాధానమిస్తూ... తోటలోని ఉత్పత్తిని మాత్రం దానం చేయమని ఆదేశించారు. ఈ దానం ఇస్లాంలో మొట్టమొదటి వక్ఫ్ దానంగా నిలిచిపోయింది.

**-షేక్ హసన్ సాహెబ్**

ఈ వక్ఫ్ ఆస్తుల ద్వారా సామూహిక సంస్థలు, సామాజిక సంస్థలు తమ ఆశయాలను, లక్ష్యాలను బాగా నెరవేర్చుకుంటున్నాయి. ఇలా ఇస్లాం చరిత్రలో, సంస్కృతిలో వక్ఫ్ నాటి నుంచి నేటి వరకు కీలక పాత్ర పోషిస్తున్నది. వక్ఫ్ ద్వారా సామూహిక, ప్రజా సంక్షేమ సంస్థలు నెలకొల్పబడ్డాయి. మహాప్రవక్త స్ఫూర్తితో దాదాపు సహాబీలందరూ తమకున్న ఆస్తిలో ఎంతో కొంత దైవ మార్గంలో వక్ఫ్ ఆస్తిగా మార్చి దైవ మార్గంలో దాన్ని ప్రజా సంక్షేమానికి వినియోగించారు. వక్ఫ్‌కు చేసే సంప్రదాయం హజ్రత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ పాలనలో కొత్తగా మళ్లీ ప్రారంభమైంది. వక్ఫ్‌కు లభించే భూములకు కొందరు ముహాజిర్లను, అన్సారీలను ఆయన సాక్షులుగా నియమించారు. ఆనాటి నుంచి ప్రభుత్వం పెద్దయెత్తున వక్ఫ్ ఆస్తులను ఏర్పాటు చేసేది. వాటిలో కొన్నింటిని ప్రభుత్వమే ఏర్పాటు చేసేది. మరికొన్నింటిని అమీర్లు, సైన్యాధిపతులు, ఉమ్మత్‌లోని ఇతర సంపన్నులు ఏర్పాటు చేసేవారు.

**తుదిగేటు**



Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**